


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 70, పేజీలు - 08

సోమవారం, జులై 8, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati




## సీఎం రేవంత్ రెడ్డికి
# బహిరంగ లేఖ

- రేవంత్ సర్కారు విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందంటూ హరీశ్ రావు విమర్శలు
- కేసీఆర్ విద్యా వ్యవస్థ పటిష్టానికి అనేక చర్యలు తీసుకున్నారని వెల్లడి
- కాంగ్రెస్ పాలన విద్యా వ్యవస్థకు శాపంలా మారిందని ఆవేదన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పట్టించుకోవడంలేదని విమర్శించారు. గతంలో విద్యా వ్యవస్థ పటిష్టం కోసం కేసీఆర్ అనేక చర్యలు చేపట్టారని వివరించారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు పాటుపడ్డారని తెలిపారు. కానీ, కాంగ్రెస్ సర్కారు విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని పేర్కొన్నారు.

6లో

## బీఆర్ఎస్ కోసం ప్రజలే
# వెదుక్కుంటూ వస్తారా.?
### - కేసీఆర్‌కు అంత నమ్మకం ఏమిటి.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ పూర్తిగా ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యారు. తనకు అత్యంత ఇష్టమైన వ్యవసాయం చేసుకుంటూ మధ్య మధ్యలో పార్టీ క్యాడర్ కు సమయం కేటాయిస్తున్నారు. వచ్చిన వారితో మాట్లాడి పంపిస్తున్నారు. ఆ మాటల్లో కేసీఆర్ వ్యక్తం చేస్తున్న అభిప్రాయాల సారాంశం ఒక్కటే. అదేమిటంటే ఇవాళ కాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండి ఖచ్చితంగా ప్రజలు బీఆర్ఎస్ కోసం వెదుక్కుంటూ వస్తారు. టార్చ్ లైట్ వేసుకుని మరీ వెదుక్కుంటూ వస్తారు. ఇప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము ఏమీ చేయాల్సిన పని లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకాలతోనే ప్రజలు తన వద్దకు వస్తారని ఆయన అచంచలమైన నమ్మకంతో ఉన్నారు. మరి తెలంగాణ రాజకీయాలు అలాగే ఉన్నాయా కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపం ఉన్నా ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్ పాలన కోసమే వస్తారన్న గ్యారంటీ ఏమిటీ.? కాంగ్రెస్ పార్టీకి ధీటుగా పార్లమెంట్ సీట్లు సాధించిన బీజేపీ ఓటు బ్యాంక్ ను కూడా భారీగా పెంచుకుంది. ఆ పార్టీ వైపు ఎందుకు చూడరు.? అసలు కాంగ్రెస్ పై వ్యతిరేకత వస్తుందని ఎందుకనుకుంటున్నారు.? కేసీఆర్ మితిమీరిన విశ్వాసంతో నిర్లక్ష్య రాజకీయాలు చేస్తున్నారా.?

### కాంగ్రెస్ పై ప్రజాగ్రహం ఖాయమని కేసీఆర్ నమ్మకం

కాంగ్రెస్ పార్టీకి పాలన చేత కాదని ఆ పార్టీ చేసే వ్యవహారాల వల్లనే ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుందని అది ఆ పార్టీకి ఉన్న చెడ్డ లక్షణమని కేసీఆర్ అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కూడా అలాగే ఉన్నాయని కేసీఆర్ భావన. కరెంట్ లేదని సూపర్ సిక్స్ పథకాలు అందడం లేదని ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని అందుకే అన్ని వర్గాలు కాంగ్రెస్ పార్టీపై తిరుగుబాటు చేస్తాయని కేసీఆర్ నమ్మకంతో ఉన్నారు. అయితే అంత వ్యతిరేకత లేదని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అర శాతం అయినా ఓట్లు పెంచుకోవడం ద్వారా నిరూపించుకుంది. ఇప్పటికీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు మాత్రమే. ఇందులో మూడు నెలలు ఎన్నికల కోడ్. అయినా రెండు లక్షల రుణమాఫీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మెల్లగా హామీలు అమలు చేసే ప్రక్రియలో ఉన్నారు. రాను రాను ప్రభుత్వంపై సానుకూలత పెంచుకుంటామని అంటున్నారు. కేసీఆర్ లాగా వృధా ఖర్చులు చేయడం లేదని చెబుతున్నారు. ప్రజల్ని రెచ్చగొట్టి తాత్కలికంగా ప్రయోజనం పొందినా పథకాల అమలుతో ప్రజల మనసుల్ని గెలుచుకుంటామని అంటున్నారు.

### కాంగ్రెస్ పై వ్యతిరేకత ఉంటే మళ్లీ కేసీఆర్ దగ్గరకే ప్రజలు రావాలా.?

బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఆశించినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి స్థాయిలో అసంతృప్తి పెరిగిపోతే తన కోసం టార్చ్ లైట్ వేసుకుని మరీ వస్తారని కేసీఆర్ నమ్మకం పెట్టుకున్నారు.

6లో

## చార్‌ధామ్ యాత్ర
# నిలిపివేత
### - ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల దృష్ట్యా నిర్ణయం



**ఉత్తరాఖండ్ (ప్రశ్న న్యూస్)** చార్ ధామ్ యాత్రకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. దేవభూమిగా గుర్తింపు పొందిన ఉత్తరాఖండ్‌లో వెలిసిన చార్ ధామ్ పుణ్యక్షేత్రాలను సందర్శించడానికి దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా తరలి వెళ్లే భక్తులకు బిగ్ అలర్ట్ ఇచ్చింది అక్కడి ప్రభుత్వం. ఉత్తరాఖండ్‌లోని యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలను చార్ ధామ్ క్షేత్రాలుగా పిలుస్తారు. భక్తుల కోసం ఆయా ఆలయాలన్నీ తెరచుకున్నాయి. ఈ ఏడాది మే 10వ తేదీన గంగోత్రి, యమునోత్రి, 12వ తేదీన

6లో

# వినేశ్ ఫోగట్‌కు స్వర్ణం




**న్యూఢిల్లీ / మ్యాడ్రిడ్ (ప్రశ్న న్యూస్)** మ్యాడ్రిడ్‌లో శనివారం జరిగిన గ్రాండ్‌ప్రీ ఆఫ్ స్పెయిన్‌లో మహిళల 50 కేజీల విభాగంలో వినేష్ ఫోగట్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత, ఇప్పుడు ఇండివిజువల్ న్యూట్రల్ అథ్లెట్‌గా పోటీపడుతున్న రష్యా మాజీ రెజ్లర్ మరియా టియుమెరెకోవాను ఫైనల్‌లో 10-5తో ఓడించి స్వర్ణం కైవసం చేసుకుంది. వినేష్

6లో

## బిజేపీలో చేరేందుకు
# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రెడీ
### - అడ్డంకిగా మారిన ఒక్క కండీషన్

**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** ఇతర పార్టీల తరపున గెలిచిన ప్రజాప్రతినిధులు బీజేపీలో చేరాలంటే కచ్చితంగా వారి పదవులకు రాజీనామా చేయాల్సిందేనని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తెలిపారు. తమతో టచ్ లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం రాజీనామా చేస్తేనే బీజేపీలో చేర్చుకుంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి స్పష్టం చేశారు. ఈడీ, సీబీఐ కేసులున్న నేతలను బీజేపీలోకి తీసుకునే అవకాశం లేదని బండి సంజయ్ చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను రామాయణ్ సర్క్యూట్ కింద అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందన్నారు. కరీంనగర్- హసన్ పర్తి రైల్వే లేన్ కోసం రూ.20 కోట్లతో చేపట్టిన సర్వే పనులు పూర్తైనట్లు తెలిపారు. కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదివారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మీడియా అడిగిన పలు



ప్రశ్నలకు స్పందించారు. ఏపీ విభజన చట్టంలోని అంశాలపై 2 రాష్ట్రాల సీఎంల భేటీపై ఆయన మాట్లాడుతూ ఏపీ విభజన చట్టంలోని పలు అంశాలకు పరిష్కారం లభించే అవకాశం ఉన్నా, గత కేసీఆర్ ప్రభుత్వం రాజకీయ

# హద్దులు దాటొద్దు
### - పార్టీ క్యాడర్ కు వార్నింగ్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన పార్టీ శ్రేణులకు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, అధికారులను కించపరిచేలా జనసేన నేతలు, కార్యకర్తలు మాట్లాడరాదని స్పష్టం చేశారు. ఎవరైనా హద్దు దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. "అభివృద్ధి క్షీణ దశకు చేరి, ప్రభుత్వ వ్యవస్థలన్నీ అస్తవ్యస్తమై ఉన్న స్థితిలో ఏపీ పాలనా పగ్గాలు చేపట్టిన ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి జనసేన

6లో

# రెండు రాష్ట్రాలు నాకు రెండు కళ్లు
### - తెలంగాణలో పార్టీకి మళ్లీ పూర్వవైభవం వస్తుందన్న చంద్రబాబు

- రెండు ప్రాంతాల అభివృద్ధే టీడీపీ లక్ష్యం
- యుగపురుషుడు ఎన్టీఆర్ ఇదే గడ్డపై టీడీపీని స్థాపించారు
- అధికారం పోయి 20 ఏళ్లు, అయినా మీ ఉత్సాహం తగ్గలేదు
- తెలుగుజాతి ఉన్నంత వరకూ పసుపు జెండా ఎగురుతుందన్న ఏపీ సీఎం
- అన్నదమ్ములు విడిపోతే చిన్న చిన్న సమస్యలు వస్తాయ్
- కష్టపడితే సంపాదన పెరుగుతుంది సుఖపడతారని వెల్లడి
- ఐకమత్యంగా ఇద్దరూ పనిచేస్తే ఇద్దరూ పైకొస్తారన్న చంద్రబాబు



ఏపీలో తన విజయానికి తెలంగాణ టీడీపీ శ్రేణులు తీవ్రంగా కృషి చేశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు ఆయన ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. టీటీడీపీ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా జై తెలుగుదేశం, జై చంద్రబాబు నినాదాలతో కార్యకర్తలు హోరెత్తించారు. అనంతరం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నేతలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తెలంగాణ గడ్డపై టీడీపీకి పునఃవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

6లో

# ఘనంగా గోల్కొండ బోనాలు
### - జగదాంబికకు తొలిబోనం - పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బోనాల జాతర ప్రారంభమైంది. శ్రీ శ్రీ జగదాంబిక మహంకాళీ గోల్కొండ బోనాల ఉత్సవాల నిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం తరఫున స్పీకర్ గడ్డం ప్రసాద్ , మంత్రులు కొండ సురేఖ , పొన్నం ప్రభాకర్ , మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి , ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ , ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజ , కలెక్టర్ అనుదీప్ బోనాలను అధికారికంగా ప్రారంభించారు. ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు అందించారు. లంగర్‌హౌజ్ చౌరస్తా నుంచి పట్టు వస్త్రాలు , తొట్టెలు ఊరేగింపు గోల్గొండ కోట వరకూ సాగింది. చారిత్రక గోల్కొండ కోటలో కొలువైన జగదాంబిక మహంకాళి ఎల్లమ్మకు తొలి బోనం సమర్పించడంతో ఉత్సవాలు మొదలయ్యాయి.

### - పోటెత్తిన భక్తులు

హైదరాబాద్ మహా నగరంలో వైభవంగా జరిగే బోనాల వేడుక

6లో

# ఏపీకి రేవంత్ రెడ్డి
### 'ఆపరేషన్ జె' మొదలు.?

- నేడు ఏపీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- వైఎస్ జయంతి వేడుకల్లో పాల్గొననున్న కాంగ్రెస్ నేత
- ఏపీలో పార్టీ బలోపేతం ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ నాయకత్వం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏపీ పర్యటనకు రానున్నారు. మంగళగిరిలో నిర్వహించనున్న వైఎస్ రాజశేఖర రెడ్డి 75వ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొననున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ జయంతి వేడుకల కోసం ఆయన కుమార్తె, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆహ్వానం మేరకు రేవంత్ రెడ్డి ఏపీకి వెళ్తున్నారు. సీఎంతో పాటు తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన పలువురు మంత్రులు, సీనియర్ నేతలు సైతం ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. నేడు వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలు పాల్గొననున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులను ఈ వేడుకలకు షర్మిల స్వయంగా ఆహ్వానించారు.

### సోనియా సందేశం..

వైఎస్ జయంతి వేళ ఏపీకి, కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ సోనియా గాంధీ ఓ సందేశం పంపారు.

6లో

## కమనీయం, రమణీయం..
# జగన్నాథుడి రథోత్సవం

- ప్రపంచ ప్రసిద్ధి చెందిన పూరీ జగన్నాథ రథయాత్ర
- 1971 తర్వాత తొలిసారిగా నేడు ఒకేసారి మూడు వేడుకలు
- పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ రఘుబర్‌దాస్, సీఎం మోహన్ చరణ్ మాంఝి

6లో



## ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించిన

**ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో ఆదివారం నాడు ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ మరియు మందకృష్ణ మాదిగ 60వ జన్మదిన సందర్భంగా కిష్టాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి అలాగే మందకృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఏ,బి,సి,డి వర్గీకరణ ఉద్యమం కోసం మొట్టమొదట 1994లో ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో మొదలైన ఈ ఉద్యమం తర్వాత దేశమంతా విస్తరించిందనారు ఈ ఉద్యమానికి ప్రధాన నాయకత్వం వహించిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కృషి వల్లనే అని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు ఏ,బి,సి,డి వర్గీకరణ అంటే ఏమిటి అనే విషయంలో చాలామందికి సందేశం ఉండేది దానికోసం వివరించిన ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ ఎస్సీలను ఏబిసిడి గ్రూపులుగా వర్గీకరించి, ఏ,గ్రూపులో "రెల్లి" సహా 12 కులాలు ఉంటాయి, వీరికి ఒక శాతం రిజర్వేషన్ ను రోస్టర్ ప్లాట్లలో ముందుగా అవకాశాన్ని ఇచ్చారు, బి,గ్రూపులో మాదిగ సంబంధిత 18 కులాలు చేర్చారు , సి, గ్రూపులో మాల కులస్తుల తో పాటు మరో 24 కులాలను చేర్చారు డి, గ్రూపులలో అది ఆంధ్ర వగైరా కులాలను ఉంటాయి ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు, ఏది ఏమైనాప్పటికీ వచ్చే పార్లమెంటు సమావేశంలో ఏబిసిడి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు కార్యక్రమంలో కిష్టాపూర్ మాజీ సర్పంచ్ గోదావరి , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్ , పోలీస్ సూరి, ఎస్ఎంసి మాజీ చైర్మన్ శ్రీశైలం , అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మోజెస్,ఎమ్మార్పీఎస్ కిష్టాపూర్ సీనియర్ నాయకులు అరికెల బాలయ్య,సొసైటీ డైరెక్టర్ చిట్యాల పోచయ్య, వరిగుంతం నాగరాజు, చిట్యాల షేకులు, తోశ దేవయ్య, తోష నవీన్, సుధాకర్, కరుణాకర్, ఏగొండ, బాలకృష్ణ, ప్రేమ్ కుమార్, భాను, సురేష్, నాగరాజు, , జుర్రు సంతు, రాజేష్ గౌడ్, రేలమడుగు పోచయ్య, మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు 26000/- పెంచాలని అంగన్ వాడి ఉద్యోగుల సమ్మె



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) అంగన్వాడి టీచర్లు మరియు ఆయాలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ముందు 2వ రోజూ దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్ వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సమ్మ మాట్లాడుతూ. పెరిగిన ధరల కనుగుణంగా అంగన్వాడీలకు తక్షణమే కనీస వేతనాలు 26000 పెంచాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్ కు రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని ఆమె అన్నారు. గత ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె సందర్భంగా టీచర్ కు 2 లక్షలు, హెల్పర్స్ కు లక్ష, పెన్షన్స్ సౌకర్యం, విఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చింది. అనంతరం ప్రభుత్వం మారి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి ఏడు నెలలు గడుస్తున్న అంగన్వాడీల పట్ల కక్షపూరితంగా పాత జీవో 10 నీ తీసుకు వచ్చి అతి తక్కువ డబ్బులు ఇచ్చి 65 సంవత్సరాలు దాటిన వారందరిని నిర్దాక్షణ్యంగా జులై 1 నుంచి ఇంటికి పంపాలని నిర్ణయించడం దుర్మార్గం అన్నారు. అంగన్వాడీలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, జీతములో సగం పెన్షన్ ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని దశలవారీగా కాంగ్రెస్ ప్రభుత్వంతో రాయబారాలు నడిపామని కమిషనర్ కు విన్నవించామన్నారు. ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని, గత ప్రభుత్వాలను గడగడలాడించిన అంగన్వాడీలు... సమస్యలు పరిష్కరించకపోతే ఆ ప్రభుత్వాలకు పట్టిన గతే రేవంత్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. తక్షణమే రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచి విఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్వాడీలు 48 సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలతో కొన్ని హక్కులు సాధించుకున్నామని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కనీస వేతనాలు 26,000 ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్వాడీలు ఎన్నో రకాల సేవలు ప్రజలకు అందిస్తున్నారని సంబంధం లేని పనులు చేయిస్తున్నారని ప్రజలలో తలలో నాలుక మాదిరిగా ఉంటున్నారని వారి సేవలను గుర్తించి వారికి ఇవ్వాల్సిన బెనిఫిట్స్ తక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## పబ్ కేసులో కీలక విషయాలు వెల్లడించిన డీసీపీ వినీత్



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) మాదాపూర్లోని రాయదుర్గం ది కేవ్ పబ్ కేసులో కీలక విషయాలు వెల్లడించారు మాదాపూర్ డీసీపీ వినీత్. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారిలో మొత్తం 24మందికి పాజిటివ్ అని తేలింది. పబ్ లోని డీజేలతో కలిసి నిర్వాహకులు డ్రగ్స్ అమ్మినట్లు గుర్తించామన్నారు. పబ్ ఓనర్లు పరారీలో ఉన్నారని.. వారిపై కేసు బుక్ చేశామని తెలిపారు. డ్రగ్స్ ఎవరు సప్లయ్ చేస్తున్నారనే వివరాలు ఆరా తీస్తున్నామన్నారు.

## తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) వెంకటాపూర్ గ్రామంలో తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన పొన్నం దేవరాజు గౌడ్ తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా కాలు జారి కిందపడిపోయాడు. దీంతో ఆయన ఎడమకాలు విరగడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రాజన్న సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి దేవరాజు ను తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండడంతో తన ఇంటికి తీసుకెళ్లారు కుటుంబ సభ్యులు. విషయం తెలియడంతో గౌడ కులస్తులు గ్రామస్తులు దేవరాజును పరామర్శించారు. నిరుపేద కుటుంబానికి చెందిన దేవరాజ్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వెంకటాపూర్ గౌడ కుల సంఘం అధ్యక్షులు పులి మల్లేష్, జాగీర్ సతీష్, గౌడ కులస్తులు సిరిసిల్ల కృష్ణ స్వామి, సిరిసిల్ల దేవయ్య, తిప్పారపు ఎల్లయ్య, తాళ్లపల్లి ప్రభాకర్, మధు గ్రామస్తులు కోరారు.

## శేరిలింగంపల్లి లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) శేరిలింగంపల్లి లో పూర్వ విద్యార్థుల కలయికతో ఉన్నత పాఠశాల కోలాహాలంగా మారింది. 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకను ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల నాటి మధుర అనుభూతులను ఒకరికొకరు పంచుకున్నారు. అప్పట్లో గురువుల నేర్పిన పాఠాలు జీవితంలో ఎలా ఉపయోగపడ్డయో తెలిపారు. 10 తరగతి 1998-1999 బ్యాచ్ విద్యార్థులు కలుసుకుని మధుర అనుభూతులను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులతో పాటు గురువులు హెడ్ మాస్టర్ ప్రభాకర్రెడ్డి, చెన్నయ్య ,యాదగిరి, లోకేష్, లక్ష్మి, జయంతకుమార్, స్వర్ణలీల, వసంతలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబు తోనే సాధ్యం

**మండల అధ్యక్షులు గుజ్జలపూడి విజయ్ కుమార్ నాయుడు**



ఓజిలి (ప్రశ్న న్యూస్) రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఒక్క సీఎం నారా చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమని ఓజిలి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జలపూడి విజయ్ కుమార్ నాయుడు అన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని సులూరుపేట నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ్ శ్రీ తోని సాధ్యమని ఆయన అన్నారు. నేతలు ఎంత మంది ఉన్నా. జాతి గర్వపడే నాయకులు కొందరే ఉంటారని ఆయన అన్నారు. ఆ కొందరిలో నూతన ముఖ్యమంత్రి,టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఉంటారని చెప్పారు. చంద్రబాబు నాయుడు అంటే కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదని%Ñ% ఆయన ఒక అనితరసాధ్యుడని, అద్వితీయ దార్శనికుడని, తెలుగు జాతి గర్వించదగ్గ నాయకుడని, రేపటి తరాల భవితను తీర్చిదిద్దే మహాశిల్పి అని ఆయన అన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తెలుగుదేశంపార్టీపై ఉన్న నమ్మకంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపించే ఏకైక నాయకుడైన చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్,టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థులకు పట్టంకట్టి అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నా మన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే ఎన్డీఏ కూటమితోనే సాధ్యమవుతుందన్నారు.

## పేద విద్యార్థులకు మున్నూరు కాపు సంఘం అండగా నిలిచింది



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్ ) సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు . లింగిశెట్టి హనుమంతరావు అధ్యక్షతన 9 కుటుంబాలకు ఆర్థిక సహాయం తో స్కూల్ ఫీజు అందించరు. ఈ కార్యక్రమానికి కోశాధికారి చేర్యాల శ్రీనివాస్ , కొత్త కల్పన, రాచూరి ప్రదీప్ కుమార్, సిరిగిరి పవన్, అలిగేపెల్లి హరికిష్ణ, కటుకూరి శ్రీకాంత్, శామీర్పేట్ కృష్ణ, ముత్తినేని రాజేందర్, బిళ్ళకంటి శ్రీనివాస్, బిళ్ళకంటి రవికాంత్, తుడి విష్ణు మూర్తి, బాసాని కిషన్ ప్రసాద్, సాకెల్లి మధుసూదన్, గంధం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలవరంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



పోలవరం (ప్రశ్న న్యూస్) పోలవరంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి భారతీయ జన సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను పోలవరంలో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించారు పార్టీ మండల కన్వీనర్ నాగరాజు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి చిత్తరామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన

**- తెల్ల హరిక్రృష్ణ కుటుంబ సభ్యులు**



కూకట్ పల్లి (ప్రశ్న న్యూస్) ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా మొదటి ఆదివారం రోజు కూకట్ పల్లి చిత్తరామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి మొక్కులు తీర్చుకొని, అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్న మేడ్చల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం, బిసి జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు తెల్ల హరికృష్ణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆకుల లక్ష్మణరావు, భోజరాజు రవి, పత్తి వారి కరణ, బసవన్న గారి నరసింహ రెడ్డి, అంబాటి సంతోష్ చక్రవర్తి కుటుంబ సభ్యులు, కొడుకులు, కోడళ్ళు, అల్లుళ్ళు, కూతుర్లు, మనమలు, మనమరాలు తో పాటు తాతయ్య అంబటి రాములు తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది.

## సీనియర్ జర్నలిస్ట్ స్వామిని పరామర్శించిన ప్రింట్ మీడియా అసోసియేషన్ ప్రతినిధులు



తిరుపతి బ్యూరో ( ప్రశ్న న్యూస్) గూడూరు కు చెందిన సీనియర్ వెటరన్ జర్నలిస్ట్ ఇస్కపల్లి శివ ప్రసాద్ శర్మ(స్వామి)ను గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పరామర్శించారు. ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ జర్నలిస్ట్ శివప్రసాద్ శర్మ ను కలసి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గూడూరు మున్సిపల్ పరిధిలోని నెల్లటూరు ఆయన నివాసంలో శివప్రసాద్ శర్మ ను కలిసి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని వారు శివ ప్రసాద్ కు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమం లో గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ జామలుల్లా, ప్రధాన కార్యదర్శి ఉడతా శరత్ యాదవ్, ఉపాధ్యక్షులు పరుచూరు బాలకృష్ణ, సభ్యులు కిషోర్ నాయుడు, కృపా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులుగా సచిన్, వెంకటేశ్వర్లు



తిరుపతి బ్యూరో (ప్రశ్న న్యూస్) గూడూరు జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులుగా హైపర్ ఛానల్ రిపోర్టర్ (సచిన్) వి నాగేంద్ర, (టీవీ-5 )ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ వెంకటేశ్వర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కాలనీలో హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షులు ఆత్మకూరు సురేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షులుగా వి నాగేంద్ర,ప్రధాన కార్యదర్శిగా బొలిగర్ల వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా (ఐ న్యూస్ )గూడూరు డివిజన్ రిపోర్టర్ కే సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా యాక్ట్ ఛానల్ రిపోర్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా గూడూరు డివిజన్ మహా న్యూస్ రిపోర్టర్ అల్తాఫ్, ప్రజాబంధం దినపత్రిక ఎడిటర్ మీజూరు మల్లికార్జున్ , న్యాయ సలహాదారుగా గూడూర్ డివిజన్ (ఏబీఎన్) ఛానల్ రిపోర్టర్ పి రమేష్, కార్యవర్గ సభ్యులుగా గూడూరు డివిజన్ ( 10 టీవీ) రిపోర్టర్ మందా ప్రభుదాస్, గూడూరు డివిజన్(6టీవీ) రిపోర్టర్ రఘు, ఉదయం దినపత్రిక గూడూరు డివిజన్ రిపోర్టర్ బాబు మోహన్ దాస్, ఇప్పుడు దినపత్రిక రిపోర్టర్ ఉడుతా శశిధర్ లను ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులకు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సమస్యల పరిష్కారానికి మీ అందరి సహకారంతో సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యవర్గ ఎన్నిక సమావేశంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు

# నాగారం మున్సిపల్ పరిధిలో
# యదేచ్ఛగా భారీ షెడ్ల నిర్మాణం

## మున్సిపల్ అధికారుల, సిబ్బంది, చైర్మన్ అండ దండలా.?

- ఫిర్యాదు చేసిన పట్టించుకొని టౌన్ ప్లానింగ్ అధికారులు
- గతంలో కూల్చివేసిన టిపిఎస్ కావ్య తిరిగి యధావిధిగా నిర్మాణాలు
- కమిషనర్ ను, చైర్మన్ ను మేనేజ్ చేసి నిర్మాణమా.?
- అక్రమ షెడ్లు, అక్రమ నిర్మాణాలపై కమిషనర్ మౌనం ఎందుకు.?








నాగారం(ప్రశ్న న్యూస్) అవినీతి అక్రమాలకు నిలయంగా నాగారం మున్సిపల్ కార్యాలయము మారింది. కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు లంచాలే పరమ అవధిగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిబంధలను ఉల్లంఘించి అక్రమ షెడ్లు, అక్రమ నిర్మాణాలు, ప్రధాన రహదారి పక్కనే భారీ షెడ్ల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. భారీ షెడ్ల నిర్మాణం జరిగింది దానితో టిపిఎస్ కావ్య కూల్చివేయడం జరిగిన అక్రమ నిర్మాణదారుడు కమిషనర్ ను మేనేజ్ చేసి.? నిర్మాణ పనులు తిరిగి చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ షెడ్ నిర్మాణదారుడు గతంలో నిర్మాణ పనులు కొనసాగిస్తుండగా టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకొని నిర్మాణ పనులు ఆపినారు. అయితే నాగారం మున్సిపల్ కి టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సెక్షన్ ఆఫీసర్ కావ్య కేవలం వారానికి రెండు రోజులు రావడంతో పని భారం పెరిగి పూర్తిస్థాయిలో కట్టడి చేయలేకపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే అదనుగా చైన్ మెన్ లు అందిన కాడికి దండుకొని కోట్లు సంపాదిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పేరుకు ఔట్సోర్సింగ్ ఉద్యోగులే అయినా సంపాదనలో మాత్రం కోటీశ్వరులుగా మారరన్న విమర్శలు ఉన్నాయి. అక్రమ షెడ్




నిర్మాణదారుడు ఉన్నంత అధికారులను మేనేజ్ చేయడంతో టీపీఎస్ సైతం అడ్డుకోలేకపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూల్చి వేసిన తర్వాత కూడా నాగారం మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు అక్రమ షెడ్లు ఆగమేఘాల మీద నిర్మాణదారులు యధావిధిగా నిర్మాణ పనులు చేయడం వెనక చైర్మన్ చంద్రారెడ్డి హస్తం ఉందా.? అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంకా జరుగుతున్న నిర్మాణదారుడు నిర్మాణ పనులు పూర్తి చేయడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. ఈ విషయాన్ని టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు స్థానికులు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధుల అండ చూసుకొని ప్రభుత్వ అధికారుల ఆదేశాలను కూడా అక్రమ షెడ్, అక్రమ నిర్మాణ దారులు యదేచ్ఛగా నిర్మించడం చూస్తుంటే స్థానిక రాజకీయ నాయకుల హస్తం ఉందని అందుకోసమే అధికారులు కూడా మామూళ్లు తీసుకొని మౌనంగా ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. షెడ్ల నిర్మాణాలకు ఏలాంటి అనుమతులు లేకుండానే అధికారులకు లంచాలు ఇచ్చి వెలుస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యహరించడం జరుగుతుందని స్థానికులు మండిపడుతున్నారు. అక్రమ షెడ్లను పూర్తిస్థాయిలో కూల్చకుండా తూతూ మంత్రంగా కూల్చివేసి లంచాలు ఎరవేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇలా చేయడం అక్రమ షెడ్ల పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు అండగా ఉంటూ షెడ్ల నిర్మాణాలకు వత్తసు పలుకుతున్నారనే ఆరొపనలున్నాయి. నాగారం మున్సిపల్ పరిధిలో కూల్చివేసిన షెడ్లు, భవనాలు కూడా యధావిధిగా నిర్మాణాలు జరుగుతున్నాయి అంటే



అధికారులు అమ్ముడుపోతున్నారా.? సిబ్బంది అమ్ముడుపోతున్నారా.? అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. నాగారం మున్సిపల్ పరిధిలో పలు కాలనీల్లో వెలుస్తోన్న అక్రమ నిర్మాణాలను అడ్డు అదుపు లేకుండా పొయింది. తీసుకున్న అనుమతులకు చేపడుతున్న నిర్మాణాలకు ఏలాంటి పొంతన లేకుండా అడ్డగొలు నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే నాధుడే కరువైయ్యారు. అధికారుల చేతివాటంతో పలు కాలనీల్లో అక్రమ కట్టదాలకు అద్దూ అదుపు లేకుండా పోతుందని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. కూల్చివేతలు తూతూ మంత్రంగా చేసి మరుసటి రోజు నుండే అక్రమ నిర్మాణాలను చేయించడం నాగారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు వెన్నతో పెట్టిన విద్యగా మారిందని దీనిపై కమిషనర్, చైర్మన్ స్పందించాలని లేనిపక్షంలో మున్సిపల్ డైరెక్టర్ కు లేదా జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, చైర్మన్ స్పందించి బారీ షెడ్లు, అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కొరుతున్నారు.

# సంస్కారాలు



గృహస్థు పాటించాల్సిన సంస్కారాల గురించి మనకు మన ప్రాచీన మహర్షులు గృహ్య సూత్రాల రూపంలో, కొన్ని వేల సంవత్సరాల క్రితమే చెప్పి ఉన్నారు. సంస్కారం అంటేనే సంస్కరించునది అని అర్థం. అంటే, ఈ సంస్కారాలు పాటించడం ద్వారా మనిషి సంస్కారవంతుడు అగుచున్నాడు. ఏవిధంగా అయితే మట్టిలో ఇతర ఖనిజలవణాలతో కలిసిపోయి దాదాపుగా మట్టిలాగే దొరికిన బంగారం, సంస్కరించబడి, అనుభవయోగ్యమైన సువర్ణంగా, ఆభరణాలుగా మారుతుందో, అలాగే మనిషి కూడా సంస్కారాలు పాటించడంద్వారా ఉన్నతమైన జీవన విధానాన్ని, పరిపక్వమైన మానసికస్థితిని పొందుచున్నాడు. తద్వారా సమస్తజనాలూ సుఖసంతోషాలతో నివసించగలిగేలా క్రమశిక్షణతో కూడిన నడవడికగల ఒక సర్వోన్నత ధార్మికసమాజాన్ని నిర్మించగలిగాడు. సంస్కారాల సంఖ్యగురించి అభిప్రాయ భేదాలున్నా, లోకంలో ప్రాచుర్యంపొందినవి మాత్రం పదహారే. ఈ పదహారు రకాల సంస్కారాల గురించి, అవి అనుసరించాల్సిన సమయాల గురించి, వాటి విధానాల గురించి, ఈ వ్యాసంలో క్లుప్తంగా తెలుసుకుందాం. మనిషికి ఈ సంస్కారాలు జరిగినట్లుగా మనకంటికి ఏమైనా మార్పులు కనిపిస్తాయా? అంటే కొన్ని సంస్కారాల తాలూకు మార్పులు కంటికి కనిపిస్తాయి, కొన్ని కనిపించవు. ఎందుకంటే, కొన్ని సంస్కారాలు శరీర సంబంధ వేషభాషలలో మార్పులు తీసుకొస్తే, కొన్ని సంస్కారాలు మానసిక పరిపక్వతనీ, ఉన్నతమైన ఆలోచనావిధానాన్నీ, సామాజిక శ్రేయస్సును కలిగిస్తాయి. శరీర సంబంధ మార్పులు కంటికి కనిపిస్తాయి, కానీ మానసికమైన మార్పులు మాత్రం వారి ప్రవర్తనలో, మాట్లాడే విధానంలో, ఎదుటివారిని గౌరవించే తీరులో, వారు తీసుకునే నిర్ణయాలలో ప్రతిబింబిస్తాయి. ఏది ఏమైనా, 'వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేనచ వకారైః పంచభిర్యుక్తః నరోభవతి పూజితః' అను ఆర్యోక్తిని అనుసరించి, ఒక వ్యక్తి గౌరవించబడాలంటే, పంచవకారాలైన వస్త్రం, వేషభాషలు, విద్యా వినయాలను పాటించాలి. వాటిని నేర్పించేది కూడా ఈ సంస్కారాలే. గర్భాధానం మొదలుగాగల పదిహేను సంస్కారాలు మనిషి జీవించి వుండగా జరిపించేవి కాగా, పదహారవ సంస్కారమైన అంత్యేష్టిమాత్రం మనిషి మరణించిన తరువాత జరిపించేది. ఇది మానవశరీరాన్ని అగ్ని మొదలైన పంచభూతాలకు హవిస్సుగా అర్పించే పరమ పవిత్రమైన సంస్కారంగా శాస్త్రాలు పేర్కొన్నాయి. దాదాపుగా ప్రతి సంస్కారమూ అగ్నిని ఆధారంగాచేసుకునే జరపాలని సమస్త గృహ్యశాస్త్రాలూ చెప్తున్నాయి. సంస్కారాల వలన సంస్కరింపబడి, దయ ఓర్పు మొదలైన ఆత్మగుణాలు కలిగినవారు పరమపదాన్ని పొందుతారని స్మృతులు చెప్తున్నాయి. సంస్కారాల వరుసక్రమంలో అభిప్రాయ భేదాలున్నా, దాదాపుగా అందరూ అంగీకరించిన వరుసక్రమాన్ని అనుసరించే వాటిని వివరించడం జరుగుతుంది.

# ప్రకృతిని పరిరక్షించుకోకపోతే విపత్తులు తప్పవు

- తిండిగింజలు - 2.3 కోట్ల టన్నులు - కూరగాయలు - 2.1 కోట్ల టన్నులు - ఏటా మనం వృథా చేస్తున్న ఉత్పత్తులు (ఆహార శుద్ధీకరణ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం...)
- పండ్లు- 1.2 కోట్ల టన్నులు - ఈ వృథా మొత్తం విలువ - 440 కోట్ల డాలర్లు (రూ. 32,329 కోట్లు)
- ఈ ఆహార వృథా ద్వారా ఉత్పత్తి అయ్యే చెత్తను కూడా పరిగణనలోకి తీసుకుంటే విలువ: 1,060 కోట్ల డాలర్లు(రూ. 77,885 కోట్లు)

**68 శాతం..** 1970 - 2016 మధ్యకాలంలో తగ్గిపోయిన క్షీరదాలు, పక్షులు, ఉభయ చరాలు, సరిసృపాలు, చేపల సంతతి

**49 శాతం..** భారత్‌లో కేవలం రెండేళ్లలోనే కాలుష్యం బారిన పడ్డ నదీ ప్రవాహాలు. ఢిల్లీలో యమున, దామన్ లోని దామన్ గంగ, ముంబైలోని మీఠీ, హరియాణాలో గగ్గర్, గంగా నదిలోని పలు ప్రాంతాలు ఇందులో ఉన్నాయి.

**భారత్‌లో క్షీణత...** క్షీరదాల సంతతిలో తగ్గుదల 12 శాతం. కప్పల వంటి ఉభయ చరాల్లో 19 శాతం క్షీణత. పక్షుల్లో 3 శాతం తగ్గుదల.

**85 శాతం..** మనిషి కోల్పోయిన చిత్తడినేలల విస్తీర్ణం

**1,000** గంగ నదీ పరీవాహక ప్రాంతంలో ఉపనదులు, ఇతర జల వనరుల ప్రవాహాన్ని అడ్డుకుంటున్న ఆనకట్టల సంఖ్య

**3** తాబేళ్ల వినాశనం విషయంలో భారత్ ర్యాంకు. చైనా, వియత్నాంలో మనకంటే ఎక్కువ విధ్వంసం జరుగుతోంది!

**82 కోట్లు** దేశంలోని 12 నదీ పరీవాహక ప్రాంతాల్లో నీటి సమస్య ఎదుర్కొంటున్న జనాభా.

**21.000** లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ (ఎల్‌పీఐ)లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా గమనిస్తున్న జంతుజాలాల సంఖ్య

**0.03 శాతం..** దేశ భౌగోళిక విస్తీర్ణంలో చిత్తడి నేలలు.


**2,500** మన జీవనదుల్లో మిగిలిన గాంజెటిక్ డాల్ఫిన్ల సంఖ్య!

**గొరిల్లాలు.. బూడిద రంగు చిలకలు** ప్రమాదం అంచుల్లోన ఉన్న జంతుజాలంలో ఇవి రెండు మాత్రమే. ఇంకా అనేకం ఉన్నాయి.

హరివిల్లులో ఏడు రంగుల స్థానంలో ఒక రంగు మాత్రమే ఉంటే? భూమ్మీద తెల్లటి పూలు మాత్రమే పూస్తే? పండ్లు అన్నింటి రుచి ఒకేలా ఉంటే? అబ్బే... ఏం బాగుంటుంది అంటున్నారా? నిజమే. అన్నీ ఒకేలా ఉంటే బోర్ కొట్టేస్తుంది! వైవిధ్యం అనేది మనసుకు ఆనందం కలిగిస్తుంది! ప్రయోజనాలూ బోలెడు! కానీ.. ఈ విషయం మనిషికి పూర్తిగా అర్థమైనట్లు లేదు. ఎందుకంటే.. మన మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుందని తెలిసినా... వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్ తదితరాల పేరుతో.... అడవులు, నదులు, సరస్సులు, నేలలను నాశనం చేస్తూనే ఉన్నాడు! వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సిద్ధం చేసిన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ -2020 చెబుతున్నది ఇదే! కోవిడ్ మహమ్మారి విజృంభణ కొనసాగుతూనే ఉంది. కోట్ల కేసులు.. లక్షల్లో మరణాలు... ఆర్థిక వ్యవస్థ ఛిద్రం.. ఉద్యోగాల కోత. ఇలా ఎన్నెన్నో సమస్యలకు ఒక వైరస్ కారణమైందంటే ఆశ్చర్యం అనిపించక మానదు. కానీ.. కోట్ల సంవత్సరాలపాటు జంతువుల్లో నిక్షేపంగా బతికిన ఈ వైరస్‌లు ఈ మధ్య కాలంలో మనిషికి ఎందుకు సంక్రమిస్తున్నాయో.. కారణమేమిటో మీరెప్పుడైనా ఆలోచించారా? హెచ్1ఎన్1 కానివ్వండి, చికెన్ గున్యా కానివ్వండి. స్వైన్‌ఫ్లూ కానివ్వండి అన్నీ జంతువుల నుంచి మనిషికి సోకిన వ్యాధులే. ఇప్పుడు కోవిడ్%--%19 కూడా. మనిషి ఎప్పుడైతే అటవీ సంపదను తన స్వార్థం కోసం విచ్చలవిడిగా వాడటం మొదలుపెట్టాడో అప్పటి నుంచే ఈ సమస్య కూడా పెరగడం మొదలైందని అంటారు నిపుణులు.ప్రకృతిని, జీవజాలాన్ని పరిరక్షించుకోవడం ఇప్పటికైనా నేర్చుకోకపోతే కోవిడ్%--%19 తరహా విపత్తులు మరిన్ని ఎదుర్కోక తప్పదని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ %--%2020లో స్పష్టం చేసింది. రెండేళ్లకు ఒకసారి విడుదల చేసే లివింగ్ ప్లానెట్ రిపోర్ట్‌ను ఈసారి దాదాపు 125 మంది నిపుణులు కలిసి సిద్ధం చేశారు. 1970 నుంచి 2016 మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 21 వేల క్షీరదాలు, పక్షులు, జలచరాలు, సరిసృపాలు సంతతిని పరిశీలిస్తూ సిద్ధం చేసిన ఈ నివేదిక దాదాపు 164 పేజీల నిడివి ఉంది. ప్రపంచవ్యాప్తంగా డబ్ల్యూడబ్ల్యూఎఫ్ పరిశీలించిన వాటిల్లో మూడింట రెండు వంతుల జంతుజాలం క్షీణావస్థలో ఉంది. మొక్కల విషయానికొస్తే... ప్రతి ఐదింటిలో ఒకటి అంతరించిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లు నివేదిక చెబుతోంది. గత ఏడాది ఉష్ణమండల ప్రాంతాల్లోని అడవులనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆరుసెకన్లకు రెండు ఎకరాల చొప్పున నష్టపోయామని నివేదిక తెలిపింది. అడవులు నరికివేసి వ్యవసాయం చేయడం మొదలుకొని నదీజలాల కాలుష్యంతో జలచరాలకు ముప్పు తేవడం వరకూ అన్నింటి ఫలితంగా భూమి ఇప్పుడు అత్యవసర సాయం కోరుతూ ఆక్రందనలు చేస్తోందని వివరించింది. ఈ పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోతే ఇంకో పదేళ్లలో సరిచేసుకునేందుకు వీలు కానంత పెద్ద ప్రమాదంలో పడతామని హెచ్చరించింది. అయితే ఇప్పటికైనా పరిస్థితి మించిపోలేదని, దేశాలన్నీ కలిసికట్టుగా పచ్చ'ధనం' పండిస్తే.. వినియోగం విషయంలో మనల్ని మనం మార్చు కోగలిగితే భూమి మరికొన్ని కాలాలపాటు పచ్చగా ఉండేందుకు అవకాశం లేకపోలేదని చెబుతోంది ఈ నివేదిక.

**ఇవీ కారణాలు** భూ వినియోగంలో మార్పులు. అటవీ విస్తీర్ణం వేగంగా తగ్గిపోతూ ఉండటం, జంతుజాలాల ఆవాస యోగ్య ప్రాంతాలు కుంచించుకుపోవడం జీవవైవిధ్యం తగ్గుదలకు ఒక కారణం. ప్రకృతి వనరుల విచ్చలవిడి వాడకం రెండో కారణం. ఇన్వేసివ్ స్పీషీస్ (ఇతర జీవావరణాల నుంచి వచ్చిన జంతువులు, పక్షులు, మొక్కలు) మూడో కారణం. నాలుగవ, ఐదవ కారణాలుగా కాలుష్యం, వాతావరణ మార్పులను పేర్కొనవచ్చు. భారత్‌తోపాటు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో జీవ వైవిధ్యతలో తగ్గుదలకు ప్రధానంగా వాటి ఆవాస ప్రాంత నష్టం కారణం కాగా.. ఇన్వేసివ్ స్పీషీస్, వ్యాధులు, అతి వాడకం ఇతర కారణాలుగా కనిపిస్తున్నాయి. భారత్‌లో నగరీకరణ, వ్యవసాయ కార్యకలాపాలు, కాలుష్యం వంటి కారణాల వల్ల చిత్తడి నేలలు దాదాపు లేకుండా పోయాయని లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ రిపోర్ట్ స్పష్టం చేసింది. అటవీ ప్రాంతాలు తగ్గడంతో జంతు సమూహాల్లోని సంఖ్య కూడా తగ్గిపోతోందని, ఇది కాస్తా సంతానోత్పత్తిపై ప్రభావం చూపడంతోపాటు వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతోందని ఈ నివేదిక తెలిపింది. గత ఏడాది భారత్‌లో అటవీ భూములను ఇతర అవసరాల కోసం మళ్లించాలన్న అభ్యర్థనలు దాదాపు 240 వరకూ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాగా.. సుమారు 99 శాతం ప్రతిపాదనలకు అనుమతి లభించిందని ఈ నివేదిక తెలిపింది.

**సమీకృత విధానంతోనే పరిష్కారం...** వేగంగా తగ్గిపోతున్న జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించాలన్నా, తద్వారా మానవ మనుగడను మరింత సుస్థిరం చేసుకోవాలన్నా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాల్సిందే. ఆహార ఉత్పత్తిని, వాణిజ్యాన్ని మరింత ప్రకృతి అనుకూలమైన పద్ధతుల్లో చేపట్టడం ఇందులో ఒకటి మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఆహారంలో కనీసం మూడో వంతు వృథాగా చెత్తబుట్టల్లోకి చేరుతుండటం జీవవైవిధ్యానికి ఏమాత్రం మంచిది కాదు. ఈ వృథా కారణంగా గాల్లోకి చేరుతున్న విషవాయువులు వైమానిక రంగ ఉద్గారాల కంటే ఎక్కువగా ఆరు శాతం వరకూ ఉండటం గమనార్హం. ఆహార రంగం ద్వారా వెలువడుతున్న విషవాయువుల్లో 24 శాతం సరఫరా నష్టాలు, వినియోగదారులు వృథా చేయడమేనని నివేదిక తెలిపింది.ఈ నష్టాలన్నింటినీ తగ్గించుకోగలిగితే జీవవైవిధ్యం పెంపునకు తోడ్పడినట్లే. భారత్ విషయానికి వస్తే.. ఉత్పత్తి అవుతున్న ఆహారంలో వృథా అవుతున్నది దాదాపు 40 శాతం. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటివి ఈ నష్టాన్ని 10 నుంచి 15 శాతంగా మాత్రమే చెబుతున్నా అంతర్జాతీయ సంస్థలు 40 శాతంగా లెక్కవేస్తున్నాయి. జంతుజాలాన్ని, ప్రకృతిని పరిరక్షించడం జీవవైవిధ్యం కోసం కీలకమైనప్పటికీ కేవలం ఈ చర్యల ద్వారా మాత్రమే పరిస్థితిని పారిశ్రామిక విప్లవం మునుపటి స్థాయికి తీసుకువెళ్లలేమని వీటికి ఇతర అంశాలూ కూడా జోడిస్తేనే మేలు జరుగుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది.



# శుక్రగ్రహంపై గ్రహాంతరవాసుల జీవం..?

సౌరకుటుంబంలో కేంద్రమైన భానుడికి దగ్గరగా ఉన్న రెండవ గ్రహం శుక్రుడు. చంద్రుడి తరువాత శుక్రగ్రహం కూడా రాత్రివేళ ఆకాశంలో ప్రకాశవంతంగా వెలుగులు పంచగలుగుతుంది. సూర్యుడి చుట్టు ఒకసారి తిరగడానికి శుక్రగ్రహానికి 224.7 రోజులు పడుతుంది. ఆకారం, ద్రవ్యరాశి, సూర్యుడి నుండి దూరం మరియు సంఘటనలలో శుక్రగ్రహం మరియు భూగ్రహం ఒకేలా ఉన్నందున శుక్రుడిని భూమి 'సోదర గ్రహం (సిస్టర్ ప్లానెట్)' అంటారు. భూగ్రహం కోట్ల జీవులకు నెలవుగా ఉంది. శుక్రగ్రహంపై కూడా జీవుల ఉనికి ఉందనే ఆధారాలను 14 సెప్టెంబర్ 2020 రోజున అంతర్జాతీయ ఖగోళ శాస్త్రవేత్తల జట్టు వ్యక్తం చేసింది. శుక్రగ్రహం వాతావరణంలో ఆసక్తికలించే అరుదైన రసాయన అణువు "ఫాస్ఫీన్" ఉందని గుర్తించారు. సాధారణంగా జీవులు మాత్రమే ఉత్పత్తి చేయగల ఫాస్ఫీన్ ఉండడంతో శుక్రుడిపై 'గ్రహాంతరవాసులు లేదా ఏలియన్స్ లేదా ఎక్స్ట్రా టెరెస్టియల్ జీవులు' ఉండవచ్చనే దిశలో పరిశోధనలు సాగుతున్నాయి. ప్రత్యక్షంగా శుక్రుడిపై జీవి ఉనికి గుర్తించినప్పటికీ, దాని వాతావరణంలోని ఆమ్ల మేఘాల సమీపాన రసాయన ఫాస్ఫీన్ ఉండడం ఆశ్చర్యాన్ని మరియు ఆసక్తిని రేకెత్తిస్తున్నదని పరిశోధకులు అంటున్నారు. భూమిపైన ఫాస్ఫీన్‌ను బ్యాక్టీరియా లేదా అసాధారణ పరిస్థితుల మధ్య పరిశ్రమలు మాత్రమే ఉత్పత్తి చేయగలవు. జీవులు మాత్రమే ఉత్పత్తి చేయగల ఇలాంటి రసాయన అణువులను శుక్రగ్రహ వాతావరణం కలిగి ఉండటమే ప్రాణుల ' జీవ-సంతకం (బయో-సిగ్నేచర్)' వైపుకు మన దృష్టిని ఆకర్షిస్తున్నాయి. శుక్రగ్రహ జీవుల ఉనికి పట్ల లోతైన అన్వేషణ చేస్తున్న అమెరికాలోని యంఐటి మాలిక్యులార్ ఆస్ట్రోఫిజిస్ట్ 'క్లార సౌసా-సిల్వా' అభిప్రాయం ప్రకారం ఫాస్ఫీన్ ఉనికి మరే ఇతర పద్దతిలో తయారుకాదని, ప్రాణులకు మాత్రమే దీనిని ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంటుందనే వాదన వినిపిస్తున్నారు. శుక్రగ్రహ ఉపరిత వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని, కాని గ్రహ ఉపరితలానికి 50 కిమీ ఎత్తున ఉన్న పొరలలో సాధారణ ఉష్ణోగ్రతాపీడనాలతో పాటు సల్ఫ్యూరిక్ ఆమ్లం, కార్బన్‌డైఆక్సైడ్ మరియు స్వల్ప నీటి ఆవిరి ఉండడంతో సహ సూర్యరశ్మి తీవ్రత తక్కువగా నమోదవుతుందని తెలుపుతున్నారు. ఈ వాతావరణ పరిస్థితులలో ప్రాణులు ఉండే సంభావ్యతలను కొట్టిపారేయలేమని నిర్థారణకు వస్తున్నారు. ఇలాంటి పరిశోధనా ఫలితాలు అమెరికా 'నాసా' శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించి మరింత లోతైన పరిశోధనలను చేసే అవకాశం ఉంటుందని అంటున్నారు. రాబోయే రోజుల్లో శుక్రగ్రహం పైకి వెళ్ళగలిగే రోవర్ మిషన్లు కార్యరూపం దాల్చి, అక్కడి సాంపుల్స్ తేగలిగితే ఈ విషయంలో మరింత స్పష్టత రానుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఫాస్ఫీన్ వాయువు విషపూరితమైనదని, రసాయన ఆయుధాల తయారీలో వాడుతారని మనకు తెలుసు. అసాధారణ పరిస్థితులలో మాత్రమే పరిశ్రమలలో తయారు చేయగల దుర్వాసనగల ఫాస్ఫీన్ అణువులో ఫాస్పరస్ పరమాణువుతో మూడు హైడ్రోజన్ పరమాణువుల కలిసి బంధాలు ఏర్పరచుకొని పిరమిడ్ ఆకృతితో ఫాస్ఫీన్ (%ూ౧%3) ఏర్పడుతుంది. శుక్రుడిపై గ్రహాంతరవాసులు ఉన్నారనే రుజువులు ఖచ్చితంగా లేకపోయినా ఫాస్ఫీన్ వాయు ఉనికి ద్వారా జీవం ఉందనే వాదన బలపడుతోంది. ఈ ఆసక్తికర అంశాన్ని లోతైన పరిశోధనలతో సత్వరమే శుక్రగ్రహంపై జీవ-సంతకం నిర్థారించబడాలని అందరం ఆశిద్దాం.

# చాలా 'పెద్దమ్మ'





మొక్కితే కరుణిస్తుంది. కోరితే వరమిస్తుంది. ప్రదక్షిణ చేస్తే నీడ్కె నిలుస్తుంది. జూబ్లీహిల్స్ పెద్దమ్మ... మనసున్న తల్లి! ఆలయ ఆవరణలో కాలుపెట్టగానే అమ్మ ఒడికి చేరినంత నిశ్చింత! మహిషాసురుడనే రాక్షసుడు ముల్లోకాల్నీ పీడించేవాడు. యజ్ఞయాగాదుల్ని నాశనం చేసేవాడు. రుషి పత్నుల్ని చెరబట్టేవాడు. ఇంద్రాదులను తరిమి కొట్టేవాడు. త్రిమూర్తులు కూడా ఆ ధాటికి తట్టుకోలేకపోయారు. 'పాహిమాం' అంటూ శక్తిస్వరూపిణి అయిన అమ్మవారిని ఆశ్రయించారు. మహిషుడేం సామాన్యుడు కాడు. మహా బలవంతుడు. అందులోనూ, వరగర్వంతో విర్రవీగుతున్నాడు. మహాశక్తి ముందు రాక్షసశక్తి చిన్నబోయింది. అంతిమ విజయం అమ్మవారిదే! ఆ సుదీర్ఘ పోరాటంలో అలసి సొలసిన మహాశక్తికి కాస్తంత విశ్రాంతి అవసరమనిపించింది. దుర్గమమైన అడవుల్లో...బండరాళ్ల మధ్య కొద్దిరోజులు సేదతీరింది. అదే...జూబ్లీహిల్స్‌లో ప్రస్తుతం పెద్దమ్మ దేవస్థానమున్న ప్రాంతమని స్థానిక ఐతిహ్యం. 'పెద్దమ్మ' అన్న మాట ఏ పురాణాల్లోనూ కనిపించదు. ఏ స్తోత్రాల్లోనూ వినిపించదు. ముగ్గురమ్మల మూలపుటమ్మే.. కడు పెద్దమ్మ! ఏడు ఎకరాల ఆవరణలో విస్తరించిన ఆధ్యాత్మిక క్షేత్రం...జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి గుడి! హైదరాబాద్ నాలుగు వందల సంవత్సరాల ప్రాచీన నగరం. భాగ్యనగర నిర్మాణానికి చాలా చాలా ముందే ...ఆమాటకొస్తే, వేల సంవత్సరాల క్రితమే జూబ్లీహిల్స్ ఆదిమతెగలకు ఆవాసంగా ఉండేదంటారు. వేటే జీవనంగా బతికే ఆ అమాయకులు తమ కులదేవత పెద్దమ్మ తల్లిని భక్తితో కొలిచేవారు.మంచి జరిగితే, నైవేద్యాలిచ్చి అమ్మ సమక్షంలో సంబరాలు జరుపుకునేవారు. చెడు జరిగితే, జంతు బలులతో తల్లికి శాంతులు జరిపించేవారు. కాలప్రవాహంలో ఆ తెగలు అంతరించిపోయాయి. జూబ్లీహిల్స్ అత్యంత ఖరీదైన ప్రాంతంగా మారింది. కానీ, అలనాటి అమ్మతల్లి ఆనవాళ్లు మాత్రం మిగిలాయి. రెండున్నర దశాబ్దాల క్రితం దాకా.. ఇక్కడో చిన్న ఆలయం ఉండేదట. ఎవరైనా వచ్చి వెలిగిస్తే దీపం వెలిగేది, లేదంటే లేదు. ఆ సమయంలో... రాత్రిళ్లు అమ్మ అడుగుల సవ్వడులు వినిపించేవని స్థానికులు చెబుతారు. భక్తులకు కల్లో కనిపించి ... తనకో ఆలయాన్ని నిర్మించమని ఆదేశించిందట.

**పీజేఆర్ చొరవతో...** కాంగ్రెస్ దివంగత నేత పి.జనార్దన్‌రెడ్డికి అమ్మవారంటే మహా భక్తి. తల్లి ప్రేరణతో ఆయన ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. 1993లో ప్రారంభమైన నిర్మాణం ఏడాదికల్లా పూర్తయింది. హంపీ విరూపాక్ష స్వామి చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఐదు అంతస్తుల ఎత్తులో గర్భగుడి, ఏడంతస్తుల్లో రాజగోపురం, గణపతి - లక్ష్మీ - సరస్వతి ఆలయాలు ప్రాణంపోసుకున్నాయి. నిజానికి, ప్రభుత్వం అప్పట్లో ఇక్కడ ఉన్నతాధికారుల నివాస సముదాయాన్ని ఏర్పాటు చేయాలనుకుంది. పీజేఆర్ ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. పట్టుబట్టి .. అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. పెద్దమ్మ దేవస్థానంలో దసరా నవరాత్రులు, శాకంబరి ఉత్సవాలు, ఆషాఢ బోనాలు ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి మంగళవారం నాగదోష పూజలు చేస్తారు. మాఘశుద్ధ పంచమి నుంచి సప్తమి వరకు వార్షిక రథోత్సవం కన్నులపండువగా జరుగుతుంది. మంగళ శుక్రవారాల్లో పదిహేనువేల మందీ, పర్వదినాల్లో లక్ష మందీ అమ్మవారిని దర్శించుకుంటారు.

# ధర్మ సూత్రధారీ హే మురారీ



'కృష్ణస్తు భగవాన్ స్వయమ్'... కృష్ణుడే పరమతత్త్వం... చరమ లక్ష్యం... ఆయన గురించి చదవడం, చెప్పడం, పాడడం, వినడం... అన్నీ అపురూపమైన అనుభవాలే. 'నీలో లేని చోద్యాలు ఈ ప్రపంచంలో ఏం ఉంటాయి?' అని అక్రూరుడన్నా... 'అటువైపు కృష్ణుడున్నాడు... ఇటువైపు ఎవరున్నారు' అని సంజయుడు హెచ్చరించినా... అవన్నీ పరమాత్మ విరాట్‌రూపాన్ని విశదీకరించే ఉదాహరణలే... క్రియ, బోధ కలగలిసిన అద్భుత తత్త్వం ఆయనది... యుగావసరాలకు అన్వయించుకోదగ్గ మహాగాథ శ్రీకృష్ణుడిది. భక్తుల కోర్కెలు తీర్చే క్రమంలో భగవంతుడు రెండు రకాల విధానాలను అనుసరిస్తాడు. సర్వం తానే స్వయంగా నిర్వహించి, తనపై మనకున్న నమ్మకాన్ని పెంచుకోవడం మొదటి పద్ధతి. మన ప్రయత్నంలో రహస్యంగా సహకరించి, మనపై మనకు నమ్మకాన్ని పెంచి విజేతలుగా తీర్చిదిద్దడం రెండో పద్ధతి. ఇందులో మొదటి దాన్ని దైవికం అని, రెండోదాన్ని పౌరుషం అని శాస్త్రం నిర్వచించింది. పరమాత్మ ప్రతి అవతారంలో ఏదో ఒకమార్గాన్నే ఎంచుకున్నాడు. కానీ కృష్ణావతారంలో మాత్రం రెండు విధాలుగానూ మనకు ఆయన దర్శనమిస్తాడు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణల్లో భాగవతంలోని కృష్ణుడు ఎవరి సహాయాన్నీ కోరలేదు. స్వయంగా తానే అవతార లక్ష్యం దిశగా సాగిపోయాడు. భారతంలోని కృష్ణుడు మాత్రం రెండో పద్ధతి అనుసరించాడు. చేసిందంతా తానే అయినా ఘనతను మాత్రం పూర్తిగా పాండవుల పరం చేశాడు. వారిని విజేతలుగా నిలబెట్టాడు. భాగవత కృష్ణుడు విశేష రసజ్ఞ మనోజ్ఞ మూర్తి. భారత కృష్ణుడు అసాధారణ అలౌకిక ప్రజ్ఞానిధి. కృష్ణ కథలో ఈ రెండూ విభిన్న కోణాలు. ఈ రెండు రకాల పాత్రల స్వభావాలు విభిన్నమైనవి, అదే సయమంలో సర్వసమగ్రమైనవి.

**అదే కృష్ణమాయ!** భాగవత కృష్ణుడి బాల్యచేష్టలు ముగ్ధమోహనాలు. అదే సమయంలో లోకకల్యాణాలు. పసిబాలుడు భయంకర రాక్షస మూకలను మట్టుబెట్టినప్పుడు జనం నివ్వెరపోవడం సహజం. అవతార పురుషుడిగా అనుమానించడం సాధారణం. అలాంటి వారిని చిలిపి చేష్టల ముసుగులో ముంచేసేవాడు. ఇది లోకం దృష్టికి సమ్మోహనకరంగా, అదే సమయంలో లోచూపునకు సంక్లిష్టభరితంగా కనిపించేది. గోపబాలురకు చెలికాడిగా, గోపికలకు వెన్నెల వేలుపుగా ఆటపాటలతో అలరించిన అపూర్వ ఘట్టాలను అనుశీలించేటప్పుడు మనం కూడా వారిలా మారిపోవడాన్నే కృష్ణమాయ అంటారు. రమణీయ రసానుభూతులు పంచడంతో పాటు రాక్షస సంహారం కూడా ఆయన చేశాడు. ఒక పురాణ పురుషుడి సర్వసమగ్ర వ్యక్తిత్వానికి ఇది గొప్ప ఉదాహరణ.

**సుస్థిర పాలన కోసం...** భారత కృష్ణుడు ధీరోదాత్తుడు, రాజనీతిజ్ఞుడు, వ్యూహనిర్మాణ చతురుడు, స్ఫూర్తిప్రదాత, మహానేత. ఆయన అవతరించే సమయానికి లోకంలో పరిస్థితులు విషమంగా ఉన్నాయి. కంస, జరాసంధ, కాలయవన, నరక, శిశుపాల, దుర్యోధనాది స్వార్థ పరుల చేతుల్లో అధికారం, సంపద ఖైదీలయ్యాయి. ఇవన్నీ దుష్టుల చేతుల్లో ఉన్నప్పుడు సామాజిక పరిస్థితులు కూడా దయనీయంగా ఉంటాయి. ధర్మంలేని చోట భద్రత, నీతిలేని చోట మనశ్శాంతి ఉండవు. అలాంటి రాజుల చేతుల్లోనుంచి ప్రజలను రక్షించాలి. సువ్యవస్థను స్థాపించాలి. రాజ్యం చిన్నచిన్న ముక్కలుగా చీలిపోయి ఉంది. అరాచకం, అనైక్యత పెరిగిపోయాయి. ఆ దుస్థితిని, క్లిష్టతను పారదోలేందుకు కేంద్ర రాజ్య వ్యవస్థను ఊహించిన, నిర్దేశించిన అద్భుత రాజనీతిజ్ఞుడు శ్రీ కృష్ణుడు. ధర్మం తప్పిన రాజులందరినీ స్వయంగానో, పాండవుల చేతనో తుదముట్టించాడు. తాను రాజ్యాధికారం కోరుకోకుండా ధార్మిక చింతనాశీలురను పాలకులుగా ఎంచి, రూపొందించి సుపరిపాలనా కేంద్ర వ్యవస్థను నిర్మించాడు. ధర్మజుని నాయకునిగా తీర్చిదిద్దిన నాయక నిర్ణేత శ్రీకృష్ణుడు.

**యుద్ధం కూడా యజ్ఞమే!** భగవద్గీత ఆవిర్భావం కూడా ఈ యుగావసరమే. అడవిలో ముక్కు మూసుకుని కూర్చున్న సర్వసంగపరిత్యాగి తన శిష్యులకు ఏకాంతంగా నూరిపోసిన ధర్మోపదేశం కాదిది.. పద్దెనిమిది అక్షౌహిణల మహాసైన్యం యుద్ధరంగంలో మోహరించి, కయ్యానికి కాలుదువ్వుతున్న ఉత్కంఠ స్థితి. తాత్కాలిక నిర్వేదానికి గురై ధర్మసంకటంలో పడిన మహాయోధుణ్ణి కార్మోన్ముఖుణ్ణి చేసేందుకు ప్రవచించిన ఉపదేశం. ఈ లోకానికంతటికీ వర్తించే ధీరవచనం. గీతాచార్యుడిగా శ్రీకృష్ణుడి వ్యక్తిత్వం శిఖరసమానమైంది. ఆయుధాన్ని పట్టనని ప్రకటించిన శ్రీకృష్ణుడు, భీమార్జునులను ఆయుధాలుగా మలుచుకుని కురుక్షేత్ర మహాసంగ్రామాన్ని సాగించాడు. యుద్ధాన్ని క్రతువు అన్నాడు పరమాత్మ. క్రతువు అంటే యజ్ఞం. 'న మమ' అనుకోవడం యజ్ఞంలో ప్రధానాంశం. 'నాది కాదు' అని ఆ మాటకు అర్థం. ఏం చేసినా, ఏం పొందినా 'న మమ' అనే భావనతో ఉండడం యోగి లక్షణం. అహంకార, మమకారాలను ఆహుతి చేసే మహోన్నత పరిణిత త్యాగశీలతనే కృష్ణుడు కర్మయోగం పేరిట అర్జునుడికి బోధించాడు. అది ఎప్పటికీ, సర్వమానవాళికీ అనుసరణీయం. కృష్ణా! ఓ మాట అడుగుతాను. నిజం చెబుతావా...? మనం ఆపదలో ఉన్నప్పుడు అడగకపోయినా వచ్చి మనకు సాయం చేసేవాడే స్నేహితుడని నువ్వే చెప్పావు కదా. మరి పాండవులు అన్ని కష్టాల్లో కూరుకుపోయినప్పుడు నువ్వేం చేస్తున్నావు? నువ్వు చెబితే ధర్మరాజు జూదం ఆడేవాడు కాదు కదా? లేదా నువ్వే ధర్మరాజు పక్షాన ఆడి అతడిని గెలిపించవచ్చుకదా. మరి నువ్వెందుకు అలా చూస్తుండిపోయావు? అంటూ నేరుగా కృష్ణుడినే అడిగాడు ఉద్ధవుడు. మరొకరైతే కృష్ణుడిని ఈ ప్రశ్న అడగటానికి కూడా ధైర్యం చేసేవారు కాదు. కానీ, ఇక్కడ అడిగినవాడు ఉద్ధవుడు. కృష్ణుడికి పరమ ప్రాణమిత్రుడు. రూపంలో కూడా అచ్చం కృష్ణుడిలాగా ఉండేవాడు. ఎంతటి ప్రాణమిత్రుడంటే నిద్రలో కూడా కృష్ణుడి పేరునే కలవరించేవాడు. అంతటి మిత్రుడు అడిగేసరికి శ్రీకృష్ణుడు కూడా మొహమాటం లేకుండా సమాధానం చెప్పాడు. ఉద్ధవా! విజయం ఎప్పుడూ వివేకవంతుడినే వరిస్తుంది. దుర్యోధనుడు వివేకవంతుడు. అందుకు ఆటలో నైపుణ్యం ఉన్న శకునితో తన ఆట ఆడించాడు. ధర్మరాజు మాత్రం తానే ఆట ఆడాలని అనుకున్నాడు. పైగా నేను అటువైపు రాకూడదని కోరుకున్నాడు. అందుకే అతడు పిలిచేవరకు రాకూడదని నిశ్చయించుకున్నా. పిలిస్తే మాత్రం తప్పకుండా వెళ్లేవాడిని అన్నాడు. అంటే కృష్ణా! తీవ్రమైన ఆపదల్లో కూరుకుపోయి పిలిస్తే గానీ రావా అంటూ మరోప్రశ్న వేశాడు ఉద్ధవుడు. మిత్రమా! జీవితంలో ప్రతిదీ కర్మానుసారమే జరుగుతుంది. నేను పక్కన ఉండి చూస్తుంటాను కానీ కర్మను మార్చలేను అన్నాడు కృష్ణుడు. అదేంటి కృష్ణా! నీ భక్తుల పక్కనే ఉంటూ వారు ఆపదలో ఉంటే చూస్తూ ఊరుకుంటావా? అన్యాయం కదూ అన్నాడు ఉద్ధవుడు. కృష్ణుడు నవ్వుతూ... మిత్రమా! నేను పక్కన ఉన్నాననే భావన ఉంటే అసలు తప్పే చెయ్యరు కదా భక్తులు అన్నాడు. తత్త్వం బోధపడింది ఉద్ధవుడికి. ఇంకా ఎన్నో సందేహాలు అడిగాడు. అన్నిటికీ తృప్తిగా సమాధానాలు చెప్పాడు పరమాత్మ. అవతార పరిసమాప్తి కాలంలో ఉద్ధవుడి పేరు మీద లోకం తన మీద వేసే నిందలు, వేసే ప్రశ్నలన్నింటికీ పరమాత్మ సమాధానం చెప్పాడు. ఈ సమాధానాల సమాహారమే 'ఉద్ధవగీత'గా ప్రసిద్ధిపొందింది.

**ఆ అయిదు భావాలు...** శ్రీకృష్ణుడు లీలామానుష రూపుడు. మానవుడిగా, దైవంగా మార్చిమార్చి తన వైభవాన్ని ప్రదర్శించాడు. శాంత, దాస్య, వాత్సల్య, సఖ్య, మధుర భావాలను భక్తులు భగవంతుడిని చేరుకునే సులభ మార్గాలుగా భావించాలి. వాటిని స్వయంగా శ్రీకృష్ణుడి జీవితంలో కూడా మనం చూడొచ్చు.

**శాంతం:** ఎంత ఉద్రిక్త పరిస్థితుల్లోనైనా నందనందనుడు శాంతంగా వ్యవహరించాడు. శిశుపాలుడు నిండు సభలో అవమానపరిచి అనరాని మాటలు అంటున్నా ప్రతిఘటించలేదు. ఉద్రేకపడలేదు. భీష్మాదులు శిశుపాలుడిని హెచ్చరిస్తున్నా తాను మాత్రం పౌరుషానికి పోలేదు. ఇచ్చిన మాట ప్రకారం నూరు తప్పులను శాంతంగానే కాచాడు.

**దాస్యం:** పెద్దల వద్ద వినయ విధేయతలతో ఉండడమే దాస్యభావం. దేవాదిదేవుడైనా అగ్రజుల వద్ద అణకువగానే మెలిగాడు. గురువు సాందీపుని వద్ద బంటులా పనిచేశాడు. రేపల్లెలో గోవుల కాపరిగా ఆ మూగజీవాలనూ సేవించాడు. అందుకే దాస్యంలో ఆయనను మించిన దివ్యాంశుడు లేరంటారు.

వాత్సల్యం: చిన్న వాళ్లతో ప్రేమగా, ఆదరంగా ఉండడం వాత్సల్యం. ధీరగంభీరుడైన దేవకీపుత్రుడు వాత్యల్యానికి కూడా మారుపేరు. తనను ఆశ్రయించిన వారిని ఆదుకోవడంలో ఆయనను మించిన కరుణామూర్తి మరొకరు కానరారు. ద్రౌపది 'అన్నా! నీవే దిక్కు' అన్నందుకు నిండు సభలో ఆమె గౌరవాన్ని కాపాడాడు. సుయోధనుడు రాజభోగాలను సిద్ధంచేసినా, విదురుని ప్రేమపూర్వక ఆహ్వానాన్నే మన్నించాడు.

**సఖ్యం:** సన్నిహితులతో, స్నేహితులతో ప్రేమగా ఉండడం సఖ్యం. సఖ్యభావంతో సన్నిహితుల హృదయాల్లో నిలిచిపోయాడు ఈ హృషీకేశుడు. చిన్ననాటి స్నేహితుడు కుచేలుడు నిరుపేదైనా, సతీ సమేతంగా అతని పాదాలు కడిగి ఆ జలాన్ని తన తలపై చల్లుకున్నాడు. ఆయన తెచ్చిన అటుకులనే మధురపదార్థాలుగా స్వీకరించాడు. ఇకఅర్జునుడికిఇష్టసఖుడిగాతుదివరకువెన్నంటి కాపాడాడు.

**మధురభావం:**

తనను ఆరాధించే వాళ్లతో అంతే ఆరాధనతో ఏకమైపోవడం మధురభావం. గోపికలను మధురభావంతో ముంచెత్తి వాళ్లను అనేక లీలల్లో ఓలలాడించాడు. వారికి అలౌకికమైన ఆనందాన్ని అందిస్తూనే అంతిమంగా వారికి మోక్షాన్ని ప్రసాదించాడు.

మధురభావం పరమాత్మ ఏ ఇతర అవతారంలోనూ కనిపించదు.

# చందన రూపుడు.. సింహాచలేశుడు





దేశంలోని అన్ని నారసింహ క్షేత్రాల్లో విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం క్షేత్రం అతి ప్రాచీనమైనది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ విశాఖపట్నం నగరానికి 11 కి.మీల దూరంలో తూర్పు కనుమల్లోని సింహగిరిపై సముద్రమట్టానికి 800 అడుగుల(244మీ)ఎత్తున ప్రశాంత వాతావరణంలో శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయం ఉంది. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశారు. సింహాచలం ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రంగా ఉంది. విశాఖ పరిసర ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంత భక్తులంతా సింహాద్రి అప్పన్నగా పిలుచుకునే వరాహ లక్ష్మీనరసింహస్వామి ఇక్కడ కొలువై ఉన్నాడు. నిత్యం చందనంతో కప్పబడి కనిపించే ఈ స్వామి నిజరూప దర్శన సమయాన్ని చందన యాత్ర లేదా చందనోత్సవం అని అంటారు. ఇది ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ తదియ (మే నెలలో) వస్తుంది.

**ఆలయ చరిత్ర-స్థల పురాణం :** స్వయంభూవైన సింహాచల శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి ఇక్కడ 11వ శతాబ్దంలో ఆలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం బట్టి తెలుస్తోంది. కళింగ శైలిలో నిర్మించిన ఈ ఆలయం అద్భుతమైన శిల్ప కళ, అందమైన గోపురాలతో భక్తులకు కనువిందు చేస్తుంది. ఆలయంలో పలు చారిత్రక సందర్భాల్లో వేసిన శిలా శాసనాలు చారిత్రక పరిశోధకులను ఆకర్షిస్తాయి. సత్యకాలంలో వేదాలు అపహరించిన హిరణ్యాక్షుడిని సంహరించిన వరాహ అవతారం, ఆ తర్వాత యుగంలో హరి ద్వేషంతో.. భక్తులను హింసించిన హిరణ్యకశిపుని వధించిన నృసింహావతారాల కలయికగా.. స్వామి ఇక్కడ వరాహ నృసింహ స్వామిగా స్వయం వ్యక్తమయ్యారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఇక్కడ రోజూ నాలుగువేదాలు, నాలాయిర దివ్య ప్రబంధాలు, పురాణాలు స్వామి వారి సన్నిధిలో పారాయణ చేస్తారు. ఇది దక్షిణ భారతదేశంలోని ముఖ్యమైన వైష్ణవ పుణ్యక్షేత్రాల్లో ఒకటి. తిరుపతి తర్వాత అత్యధిక ఆదాయం (రూ.52 కోట్లు)కలిగిన దేవాలయమిదే. ఏడాది మొత్తంలో 12 గంటలు మాత్రమే దేవుడి నిజరూప దర్శనం భక్తులకు లభిస్తుంది. శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి వారు ఏడాదిలో 364 రోజులు సుగంధ భరిత చందనంతో కప్పబడి ఉంటారు. భక్తులకు నిత్యం దర్శనం ఇచ్చేది.. ఈ చందన అవతారంలో వుండే స్వామి వారే. ఏటా ఒక్క వైశాఖ శుద్ధ తదియ నాడు మాత్రమే.. అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ ఆ నిజరూప దర్శనం ఉంటుంది. స్వామి వారి నుంచి తొలగించిన గంధాన్ని చందన ప్రసాదంగా భక్తులకు అందజేస్తారు. అలాగే గిరి ప్రదక్షిణ కూడా ఇక్కడ ప్రత్యేకంగా జరిగే ఉత్సవం. మిగతా సమయాల్లోనూ ఎంతో రద్దీగా ఉండే సింహాచలం ఆలయం ఈ రెండు సందర్భాల్లో ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బంగా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షల మంది భక్తులతో మరింత రద్దీగా మారుతుంది. ఈ సందర్భంగా ప్రత్యేక ఆర్జిత సేవలు ఉంటాయి. ఆలయంలో కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకొని కోరికలు కోరుకుంటే అవి తీరుతాయనేది భక్తుల విశ్వాసం.

**ప్రధాన పూజలు :** 1. స్వామి వారి నిత్యకల్యాణం: టిక్కెట్టు ధర రూ.1000, రోజూ జరిగే ఈ సేవలో స్వామివారి పట్టు శేష వస్త్రం, చీర, రవికె, 80 గ్రాముల బరువు ఉండే 6 లడ్డూలు, 2 పులిహోర ప్యాకెట్లు, ఆరుగురికి ఉచిత దర్శనం, అన్నదానంలో ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తారు.

2. స్వర్ణ పుష్పార్చన: టిక్కెట్టు ధర రూ.1116, ప్రతి గురువారం ఉదయం 7 గంటల నుంచి గంటపాటు జరుగుతుంది. పాల్గొన్న వారికి కండువా, రవికె, 2 లడ్డూలు, 2 పులిహోర ప్యాకెట్లు ఉచితంగా అందజేస్తారు.

**ఇతర సేవల ధరలు** సహస్రనామార్చన: రూ.200, అష్టోత్తర శతనామార్చన: రూ.100, లక్ష్మీ అష్టోత్తర శతనామార్చన: రూ.50, గరుడ సేవ: రూ.300, కప్పస్తంభ ఆలింగనం: రూ.25, లక్ష్మీనారాయణ వ్రతం: రూ.50, గోపూజ: రూ.50 గోసంరక్షణ పథకం విరాళం: రూ.1116, పశువుకట్టు: రూ.15, అన్నప్రాశన, అక్షరాభ్యాసం: రూ.50. ద్విచక్రవాహన పూజ: రూ.100, కారు పూజ: రూ.200

కేశఖండన: రూ.10

**టిక్కెట్లు దొరికే స్థలాలు:** అన్ని పూజా టిక్కెట్లు ఆలయంలోని కప్పస్తంభం వద్ద ఇస్తారు. రూ.100 దర్శనం టిక్కెట్లను గాలిగోపురం వద్ద ప్రత్యేక కౌంటర్లో ఇస్తారు. రూ.20 టిక్కెట్లు క్యూలైన్ల మధ్యలోనే ఇస్తారు.

**ప్రసాదాల ధరలు :** లడ్డూ(80గ్రాములు): రూ.5, పులిహోర : రూ.5, చక్కెర పొంగలి: రూ.3, రవ్వ లడ్డూ : రూ.2, దర్శన వేళలు , ఉదయం 6.30 నుంచి 11.30 వరకు సర్వదర్శనం, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు రాజభోగం సందర్భంగా అరగంట పాటు దర్శనాలు నిలుపుదల చేస్తారు. మధ్యాహ్నం 12 నుంచి 2.30 వరకు సర్వదర్శనం. మధ్యాహ్నం 2.30 నుంచి 3 వరకు పవళింపు సేవ. దర్శనాలు ఉండవు . సాయంత్రం 3 నుంచి రాత్రి 7 వరకు సర్వదర్శనం. రాత్రి 7 నుంచి 8.30 వరకు ఆరాధన. దర్శనాలు లభించవు.

రాత్రి 8.30 నుంచి 9 వరకు సర్వదర్శనం. రాత్రి 9.00 పవళింపు సేవ జరిగి తలుపులు మూసివేస్తారు. మరలా ఉదయం 6.30కి యథావిధిగా దర్శనాలు లభిస్తాయి. దర్శనం టిక్కెట్ల ధరలు,రూ.100 గాలిగోపురం నుంచి అంతరాలయంలోకి ప్రవేశం. రూ.100 అష్టోత్తరం టిక్కెట్టు. అంతరాలయంలో గోత్రనామాలతో పూజ చేస్తారు. రూ.20 సాధారణ క్యూలైన్ల నుంచి ఆలయంలోకి ప్రవేశం.

**రవాణా సౌకర్యం :** సింహాచల క్షేత్రం విశాఖపట్నం ద్వారా నౌకా, రైలు, రోడ్డు, విమాన మార్గాల్లో అనుసంధానమై ఉంది. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి కేవలం 11 కి.మీ, విశాఖ ప్రధాన రైల్వే స్టేషన్ నుంచి 11 కి.మీ, విశాఖపట్నం బస్ స్టేషన్ నుంచి 12 కి.మీ దూరంలో ఉంది. సింహాచలానికి 5 కి.మీల దూరంలో గోపాలపట్నం వద్ద సింహాచలం రైల్వే స్టేషన్ కూడా ఉంది. ఆయా ప్రాంతాల నుంచి సింహాచలానికి విస్తృత రవాణా సదుపాయం ఉంది. అన్ని చోట్ల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ప్రైవేట్ క్యాబ్‌లు, ఆటోలతో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా వుంది. సింహాచలం కొండ దిగువ నుంచి ఎగువకు మాత్రం సింహాచలం దేవస్థానమే ప్రత్యేక వాహనాలను నడుపుతోంది. సొంత వాహనాలు ఉంటే నామమాత్రపు (రూ.10) టోల్ రుసుము చెల్లించి ఆ వాహనాల్లోనే చేరుకోవచ్చు. కొండ పైకి చేరుకునేందుకు దేవస్థానం వారు నాలుగు, ఆర్టీసీ వారు 20 బస్సులు నడుపుతున్నారు. ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది. ఇక చందనోత్సవం, గిరి ప్రదక్షిణ, ముక్కోటి ఏకాదశి, బ్రహ్మోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో ఆర్టీసీ మరిన్ని ప్రత్యేక సర్వీసులు నడుపుతుంది. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేకంగా స్వామివారి ఆలయ గాలిగోపురం పక్కన లిఫ్టు సౌకర్యం ఏర్పాటు చేశారు.

**వసతి వివరాలు :** కొండపై సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే పలు సత్రాలు ఉన్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చందన టూరిస్టు రెస్ట్ హౌస్, తితిదే సత్రాలు ఉన్నాయి. కొండ కింద పలు ప్రైవేటు వసతి గదులు అందుబాటులో వున్నాయి.

**ఇతర దర్శనీయ స్థలాలు :** ఆండాళ్ సన్నిధి(గోదాదేవి), సింహవల్లీ తాయారు సన్నిధి, లక్ష్మి నారాయణ సన్నిధి, త్రిపురాంతక స్వామి ఆలయం, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, శ్రీసీతారామస్వామి ఆలయం, గంగాధర, అడివివరం గ్రామం నుంచి 3 కి.మీల దూరంలో భైరవస్వామి సన్నిధి, కొండ దిగువన వరాహ పుష్కరిణి, కొండ మెట్ల మార్గంలో ఆంజనేయ స్వామి ఆలయం, కొండపై శ్రీకృష్ణదేవరాయలు వేయించిన విజయ స్థూపం, సింహాచలానికి 8 కి.మీ దూరంలో శ్రీమాధవ స్వామి, వేణుగోపాల స్వామి, మల్లికార్జున స్వామి ఆలయాలు ఇక్కడికొచ్చే పర్యాటకులు, భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి.

**పరిసరాల్లోని దర్శనీయ స్థలాలు :** ఇక ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరున్న విశాఖపట్నం, భీమిలి బీచ్, తొట్లకొండ బౌద్ధారామం, తదితరాలు ఉన్నాయి. ఇవి కాక, ఆంధ్రా వూటీగా పేరున్న ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, బొర్రా గుహలు, అరకులోయ (సుమారు 100 కి.మీ) వెళ్లడమూ సౌలభ్యంగా ఉండటం సింహాచలం వచ్చే పర్యాటకులకు కలిసొచ్చే అంశాలుగా చెప్పుకోవచ్చు.

## సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ

రాష్ట్రంలోని పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వసతులు అంతంత మాత్రమేనని, తగినంత మంది టీచర్లు లేరని, పుస్తకాల కొరత, తాగునీటి కొరత ఉన్నాయని హరీశ్ రావు వెల్లడించారు. జీతాల చెల్లింపు ఆలస్యమవుతోంది ఆరోపించారు. విద్యాశాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ అంశాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని హరీశ్ రావు తన లేఖలో విమర్శించారు. మీరు అధికారంలోకి వచ్చి ఏడు నెలలయింది కొత్తగా మీరు చేసిందేమీ లేకపోయినా, గత ప్రభుత్వం చేసిన వాటిని కొనసాగిస్తే బాగుండేది అని హితవు పలికారు. కాంగ్రెస్ సర్కారు పాలన తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ప్రభుత్వ పాఠశాలలకు శాపంలా మారిందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం హెల్పర్లకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 9 వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ కోసం ప్రజలే వెదుక్కుంటూ వస్తారా.?

కేసీఆర్ ఇక్కడ టార్చ్ లైట్ అనే పదం వాడటానికి కారణం కరెంట్ సమస్యలు. కాంగ్రెస్ కు కరెంటివ్వడం చేత కాదని తాను సీఎంగా ఉంటే మాత్రమే కరెంట్ వస్తుందని ప్రజలు నమ్ముతారని ఆయన అనుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంట్ సమస్యలు లేవు కానీ తరచూ కరెంట్ పోవడం, రావడం వంటివి జరుగుతున్నాయి. దీనిపై విస్తృత ప్రచారం జరిగింది. ఇటీవలి కాలంలో ఆ సమస్యను కూడా పరిష్కరించినట్లుగానే ఉన్నారు. పెద్దగా సమస్యలు రావడం లేదు. వర్షాలు సమృద్ధిగా పడితే కరెంట్ సమస్య రాదన్న అంచనాలు ఉన్నాయి. సరే ఎలా అయినా ప్రజలకు ఇక్కట్లు వస్తే వారంతా బీఆర్ఎస్ దగ్గరకే వస్తారని కేసీఆర్ ఆశలు పెట్టుకోవడానికి మాత్రం సరైన లాజిక్ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఎందుకంటే కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా బీజేపీ రెడీ అయిపోయింది. బీఆర్ఎస్ పార్టీ ఓటు బ్యాంక్ మొత్తం పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి షిఫ్ట్ అయిపోయింది. ఒక్క సారి మారిన ఓటు బ్యాంక్ మళ్లీ మళ్లీ వెనక్కి రావడం అంటే అంత తేలిక కాదు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా బీజేపీ తన ప్రయత్నాలను చాపికింద నీరులా చేసుకుంటోంది. బీఆర్ఎస్‌ను నిర్వీర్యం చేసే బాధ్యతను కాంగ్రెస్ పార్టీనే తీసుకోవడంతో బీజేపీ కూల్ గా ఉంది. చేరికలతో బీఆర్ఎస్ ను పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేసేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారు. దీని వల్ల బీఆర్ఎస్ బలహీనపడుతుంది కానీ కాంగ్రెస్ బలపడదు. అంతర్గత సమస్యలు పెరిగి బలహీనపడుతుంది. నేతలు ఎక్కువైనా ఇబ్బందే. కానీ బీజేపీతో అయినా నేరుగా తలపడవచ్చు కానీ బీఆర్ఎస్ మాత్రం మధ్యలో ఉండకూడదన్న రాజకీయం చేస్తోంది. ఈ రాజకీయాన్ని కేసీఆర్ అంచనా వేయలేకపోతున్నారని అనుకోవచ్చు.
బీఆర్ఎస్ మళ్లీ గెలుస్తుందని ఈ సారి పదిహేనేళ్లు అధికారంలో ఉంటుందని కేసీఆర్ చెబుతున్న మాటల్ని లీడర్, క్యాడర్ నమ్మలేకపోతున్నారు. వరుసగా సాగుతున్న పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర పార్టీల్లో చేరిపోతున్నారు. నీవు నేర్పిన విద్యయే అన్న చందంగా కేసీఆర్ బాటలోనే సాగుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రేవంత్ రెడ్డి హస్తం గూటికి చేర్చుతున్నారు. వారు వెళ్లిపోతే మీరే నేతలంటూ ద్వితీయ శ్రేణి నేతలకు కేసీఆర్ ఆఫర్లిస్తున్నారు. కానీ స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే నాటికి వారు కూడా పార్టీలో ఉంటారో ఉండోర తెలియని పరిస్థితి. అయినా కేసీఆర్ నమ్మకంలో బిగిని సడలించడం లేదు. కానీ క్యాడర్ మాత్రం నమ్మలేకపోతున్నారు.
కేసీఆర్‌కు తాను అద్భుతమైన పాలన అందించానని నమ్మకం. అందుకే ఎక్కడ మాట్లాడినా పాలిచ్చే బర్రెను కాదని దున్నపోతును తెచ్చుకున్నారని ప్రజల తీర్పును తప్పుపడుతూ ఉంటారు. ఏ గాలి మాయలోపడి జనం కాంగ్రెస్‌కు ఓట్లేశారని ప్రజల గుండెలను చీల్చితే కేసీఆర్ కనిపిస్తారని అనేక సార్లు చెప్పారు. తెలంగాణ సమాజం తిరిగి బీఆర్ఎస్ పాలనను కోరుకుంటుందని ఆయన పదే పదే చెబుతున్నారు. దీనికి కారణంగా ఆయన ప్రభుత్వంపై భవిష్యత్ లో చేయబోయే పోరాటాలను చూపించడం లేదు పదేళ్ల పాటు తాను చేసిన పాలనను గుర్తు చేసుకునే ప్రజలు వస్తారని అనుకుంటున్నారు. కానీ ఆ పాలన చూసిన తర్వాతనే ఓడించారని ఇతర పార్టీలు గుర్తు చేస్తున్నాయి. వచ్చే నాలుగేళ్లు ప్రభుత్వంపై పోరాడితేనే ప్రజలు గుర్తిస్తారని లేకపోతే ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీనే చూస్తారన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో ఉంది.

# చార్‌ధామ్ యాత్ర నిలిపివేత

కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలను భక్తుల సందర్శనార్థం తెరిచారు.మళ్లీ శీతాకాలం ఆరంభ సమయంలో అంటే నవంబర్ 12వ తేదీన గంగోత్రి, యమునోత్రి, 14వ తేదీన కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలు మూతపడతాయి. విపరీతమైన మంచు పడటం, ప్రతికూల వాతావరణం వల్ల సంవత్సరంలో ఆరు నెలలు మాత్రమే ఆయా ఆలయాల్లో భక్తులకు అనుమతి ఉంటుంది. ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లో అతి భారీ వర్షాలు కురుస్తోన్నాయి. కొండచరియలు విరిగిపడుతున్నాయి. నదులు ఉప్పొంగుతున్నాయి. వర్షాల తీవ్రత మరో మూడు రోజుల పాటు ఉంటుందంటూ డెహ్రాడూన్‌లోని భారత వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని చార్ ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసింది ఉత్తరాఖండ్ ప్రభుత్వం. ఈ విషయాన్ని ఘర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే వెల్లడించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. వర్షాల తీవ్రతపై ఆయన ఈ ఉదయం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.చార్ ధామ్ యాత్రకు వచ్చే భక్తులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఈ యాత్రలో ఉన్నావాళ్లు రిషికేష్ వద్దే ఆగిపోవాలని కోరారు. భక్తులకు ఎలాంటి ప్రమాదం సంభవించకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని వివరించారు. సురక్షితంగా ఉండాలని సూచించారు. కొద్దిరోజులుగా ఉత్తరాఖండ్‌లో అతి భారీ వర్షాలు కురుస్తోన్నాయి. కొండచరియలు విరిగిపడటం వల్ల బద్రీనాథ్‌కు వెళ్లే జాతీయ రహదారి మూసుకుపోయింది. ఈ మార్గంలో రాకపోకలు సాగట్లేదు. అనేక చోట్ల రోడ్లు ధ్వంసం అయ్యాయి. గుంతలు ఏర్పడ్డాయి. ప్రయాణం సాగించడానికి అనుకూలంగా ఉండట్లేదు. జోషిమఠ్ సమీపంలోని విష్ణు ప్రయాగ వద్ద అలకనందా నది ఉగ్రరూపాన్ని ధరించింది. ఉప్పొంగి ప్రవహిస్తోంది. ప్రమాద సూచికను మించి అలకనందా నది పరుగులు పెడుతోంది. తీర ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. విష్ణు ప్రయాగ వద్ద దహూలి గంగతో సంగిస్తుందీ నది.

# వినేశ్ ఫోగట్‌కు స్వర్ణం

ఫైనల్‌కు దూసుకెళ్లేందుకు పెద్దగా కష్టపడకుండా మూడు బౌట్‌లను గెలుచుకుంది. 29 ఏళ్ల మాజీ ఆసియా గేమ్స్ స్వర్ణ పతక విజేత క్యూబాకు చెందిన పాన్ అమెరికన్ ఛాంపియన్ యుస్నీలిస్ గుజ్మాన్‌ను 12-4 పాయింట్లతో ఓడించింది. 2022లో బర్మింగ్‌హామ్‌లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతక విజేత కెనడాకు చెందిన మాడిసన్ పార్క్స్‌పై క్వార్టర్ ఫైనల్స్‌లో ఆమె పతనం ద్వారా విజయం నమోదు చేసింది వినేష్ ఫోగట్. సెమీఫైనల్లో వినేశ్ 9-4 పాయింట్ల తేడాతో కెనడాకు చెందిన కేటీ డచ్చక్‌పై గెలిచింది. స్పెయిన్‌లో శిక్షణతో కూడిన పోటీ తర్వాత, వినేష్ పారిస్ క్రీడలకు సన్నాహకంగా 20 రోజుల శిక్షణ కోసం ఫ్రాన్స్‌కు వెళ్లనున్నారు. కాగా, జూలై 3న, వినేష్ ఫోగాట్ ఆమెకు వీసా రాలేదని %శ%లో పోస్ట్ చేసిన తర్వాత ప్రభుత్వం సహాయంతో ఆమె స్కెంజెన్ వీసా పొందింది. తన వీసాకు సంబంధించిన సమాచారం లేనందున ఆమె మొదట్లో క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవియా, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి "అత్యవసర సహాయం" కోరింది. దీంతో స్పందించిన కేంద్రం ఆమెకు వెంటనే వీసా వచ్చే విధంగా చర్యలు చేపట్టింది. దీంతో ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# హద్దులు దాటొద్దు

శ్రేణులన్నీ వెన్నుదన్నుగా నిలవాలి. పార్టీకి చెందిన ఏ ఒక్కరూ ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా మాట్లాడొద్దు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్న తరుణంలో పార్టీ నియమనిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనసేన పార్టీలో ఎవరు మాట్లాడినా, అధికారుల పనితీరును బలహీనపరిచేలా మాట్లాడినా, నిరాధార ఆరోపణలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. అంతేకాదు, ప్రోటోకాల్ కు విరుద్ధంగా అధికారిక సమావేశాల్లో పార్టీ నేతలు కానీ, కార్యకర్తలు కానీ పాల్గొనడం నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. ప్రోటోకాల్ గీత దాటే వారి పైనా చర్యలు ఉంటాయి" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## బీజేపీలో చేరేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రెడీ

లబ్ది కోసం సమస్యల్ని నాన్చిందన్నారు. ఇప్పుడు 2 రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇలాగే వ్యవహరిస్తే విభజన సమస్యలు త్వరలోనే పరిష్కారం కానున్నాయి. ఇప్పటికే మాజీ సీఎం కేసీఆర్ ఈ భేటీని అడ్డం పెట్టుకుని మళ్లీ ప్రజలను ఎట్లా రెచ్చగొట్టాలా అని ప్రయత్నిస్తున్నారు. ఆ అవకాశం ఇవ్వొద్దని చంద్రబాబు, రేవంత్ లను బండి సంజయ్ కోరారు. సీఎంలు చర్చించిన విషయాలు కేంద్రం దృష్టికి రావాలన్నారు.'ఈడీ, సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థల విచారణకు, బీజేపీకి ఏం సంబంధం లేదు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవినీతి పరులను ఉపేక్షించదు. ఈడీ, సీబీఐ విచారణ ఎదుర్కొంటున్న నేతలు, కేసులన్న నేతలు బీజేపీలో చేరే ఛాన్స్ లేదు. ఇతర పార్టీల్లో గెలిచిన కాంగ్రెస్ లో చేరినట్లు రాజీనామా చేయకుండా బీజేపీలో చేరడం సాధ్యం కాదు. రాజీనామా చేసి బీజేపీకి రావాల్సిందే. కేశవరావు (కేకే)తో రాజీనామా చేయించిన కాంగ్రెస్ పెద్దలు ఆ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించరు. పార్టీ ఫిరాయించే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజా తీర్పు కోరితేనే కాంగ్రెస్ కు గౌరవం. ఒకవేళ ఉప ఎన్నికలు జరిగితే బీజేపీయే గెలుస్తుందని' బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి మార్పుపై జాతీయ నాయకత్వం చూసుకుంటుందని, కొత్త వారికి ఆ పదవి ఇవ్వకూడదనే నిబంధన ఏమీ లేదన్నారు.ఇల్లంతకుంట, కొండగట్టు అలయాలను రామాయణ సర్క్యూట్ కింద అభివృద్ధి చేసే అవకాశం ఉందన్నారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చేందుకు సిద్ధం. గత ప్రభుత్వాన్ని అనేకమార్లు కోరినా కేసీఆర్ ప్రతిపాదనలు పంపలేదని తెలిపారు. కరీంనగర్ - హసన్ పర్తి రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే జరిగింది. త్వరలోనే రైల్వే లేన్ నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటాం. రైల్వే లైన్ వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని బండి సంజయ్ పేర్కొన్నారు.'కాంగ్రెస్ నేతలు, తెలంగాణ ప్రభుత్వం చెబుతున్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డి అడిగితే స్మార్ట్ సిటీ మిషన్ గడువును కేంద్రం ప్రభుత్వం పొడిగించలేదు. రాజస్తాన్, మధ్యప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి వస్తున్న అభ్యర్థన మేరకే కేంద్రం నిర్ణయం తీసుకుంది. స్మార్ట్ సిటీ మిషన్ గడువు పొడిగింపుతో కరీంనగర్ కార్పొరేషన్ కు మరిన్ని నిధులు రానున్నాయని' కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు.

# ఘనంగా గోల్కొండ బోనాలు

చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో అమ్మవారికి తొలిబోనం సమర్పించారు. డప్పు చప్పుళ్లు, శివసత్తులు పూనకాలు, పోతరాజులు విన్యాసాలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మారుమోగాయి. నిన్నటి నుండి మొదలైన బోనాల సందడి ఆషాడం మాసం ముగిసేవరకూ ఘనంగా జరగనున్నాయి ఆఖరి రోజు గోల్గొండ కోటలోనే ముగింపు ఉత్సవాలు జరగనున్నాయి.అంటే మొదటి పూజ చివరి పూజ గోల్కొండ జగదాంబ అమ్మవారి ఆలయంలోనే.

### - జూలై 22న 'రంగం'

ఈ నెల 21న లష్కర్ సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాంళి బోనాలు, ఈ నెల 28న పాతబస్తీ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాలు జరుగుతాయి. పాతబస్తీలో 11 రోజుల పాటు ఉత్సవాలు కన్నులపండువగా జరుగుతాయి. సింహవాహిని మహంకాళి ఆలయంతో పాటూ ఉప్పుగూడ మహంకాళి ఆలయం, హరిబౌలి అక్కన్న మాదన్న ఆలంయాల్లోనూ బోనాలు సమర్పిస్తారు. ఈ నెలలో ప్రతి గురువారం, ఆదివారం బోనాల వేడుకలు నిర్వహిస్తారు. ఇక సికింద్రాబాద్ ఉజ్జయిని మహాంకాళి ఆలయంలో జరిగే బోనాలకు ఘనచరిత్ర ఉంది. 1814 నుంచి అక్కడ బోనాల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. జూలై 22న రంగం(భవిష్యవాణి ) నిర్వహించనున్నారు. అంబారీపై అమ్మవారి ఊరేగింపు, పలహారం బండ్ల ఊరేగింపు నిర్వహిస్తారు.

### ఓ వైపు భక్తి - మరోవైపు ఆరోగ్యం

ఆషాడమాసం అంటే వానలు కురిసే సమయం అంటువ్యాధులు విజృంభించి అనారోగ్యం పెరిగే సమయం. ఈవ్యాధుల నుంచి రక్షించమ్మా అని వేడుకుంటూ అమ్మ ప్రసాదించిన ఆహారాన్ని ఆమెకు కృతజ్ఞతతో సమర్పించే భోజనమే బోనం. అందుకే ఈ క్రతువు కోసం వినియోగించే వస్తువులన్నీ వైరస్ లను తరిమేసేవే వేపాకులు, పసుపు, పసుపునీళ్లు ఇవన్నీ ఆరోగ్యానికి దివ్యమైన ఔషధాలే. ఆయురారోగ్యాలను ప్రసాదించి చల్లంగ చూడమ్మా అంటూ భక్తిపూర్వకంగా బోనాలు సమర్పిస్తారు.

# ఏపీకి రేవంత్ రెడ్డి

షర్మిల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందనే విశ్వాసాన్ని సోనియా వ్యక్తం చేశారు.

### ఏపీకి రెండోసారి రేవంత్

ఇక రేవంత్ రెడ్డి విషయానికి వస్తే తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఏపీలో పర్యటించనుండటం ఇది రెండోసారి. ఎన్నికల ముంగిట విశాఖపట్నంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభకు రేవంత్ రెడ్డి హాజరయ్యారు. షర్మిల కోసం, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసం తాను ఇక ముందు కూడా ఆంధ్రాకు వస్తానని రేవంత్ తెలిపారు. ఇప్పుడు ఆయన మరోసారి తెలంగాణ సీఎం హోదాలో ఏపీకి వెళ్తున్నారు. ఏపీలో పార్టీని బలోపేతం చేయాలనే పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఇందుకోసం ప్రతి అవకాశాన్ని వాడుకునే ఉద్దేశంతో ఆ పార్టీ కనిపిస్తోంది. ఈ క్రమంలోనే షర్మిలకు పీసీసీ చీఫ్‌గా పగ్గాలు అప్పగించింది. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న తొలి వైఎస్ జయంతి వేడుకలు కావడంతో ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది.

### వైఎస్ వారసత్వంపై కాంగ్రెస్ కన్ను

ఏపీ విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైంది. కాంగ్రెస్ స్థానాన్ని జగన్ నాయకత్వంలోని వైఎస్సార్సీపీ ఆక్రమించింది. ఇప్పుడు ఏపీలో తిరిగి పాగా వేయాలనే లక్ష్యంతో ఉన్న హస్తం పార్టీ జగన్ సోదరి షర్మిలను తమవైపు తిప్పుకోగలిగింది. వైఎస్ రాజశేఖర రెడ్డి వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చి తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్న జగన్‌కు ఇప్పుడు కాంగ్రెస్ రూపంలో, తన సోదరి రూపంలోనే ముప్పు పొంచి ఉంది. వైఎస్ రాజశేఖర రెడ్డి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని ఆయన వారసురాలిగా తాను కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్నానని షర్మిల ప్రచారం చేసుకుంటున్నారు.

### టార్గెట్ 2029..

2029 ఎన్నికల నాటికి ఏపీలో బలోపేతం కావాలనే లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ తిరిగి తన పాత ఓటు బ్యాంకును దక్కించుకోవాలనే ప్రయత్నాల్లో ఉంది. సింపుల్‌గా చెప్పాలంటే కాంగ్రెస్ పార్టీ ఏపీలో బలం పుంజుకోవడం కోసం 'ఆపరేషన్ జె' మొదలుపెట్టినట్టే. దీనికి రేవంత్ రెడ్డి సహా ఇతర రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ కీలక నేతలు తమ వంతు సహకారం అందించాల్సి ఉంటుంది. హస్తం పార్టీ ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో జగన్ పార్టీ వాటిని ఎలా ఎదుర్కొంటుందో చూడాలి మరి.

## కమనీయం, రమణీయం..

# జగన్నాథుడి రథోత్సవం

భువనేశ్వర్ (ప్రశ్న న్యూస్) ప్రపంచ ప్రసిద్ధి చెందిన పూరీ జగన్నాథ రథయాత్ర అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ఒడిశాలోని పూరీ పుణ్యక్షేత్రం ఇసుకేస్తే రాలనంతగా భక్తులతో క్రిక్కిరిసిపోయింది. పూరీ క్షేత్రంలో ఒకేసారి మూడు వేడుకలు చేపట్టడంతో దేశం నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. 1971 తర్వాత తొలిసారిగా ఒకే రోజున పూరీ జగన్నాథుడి నవయవ్వన దర్శనం, నేత్రోత్సవం, రథయాత్ర చేపట్టారు. జై జగన్నాథ్, హరిబోల్ నామస్మరణతో పూరీ విధులన్నీ మార్మోగుతున్నాయి. కాగా, రథయాత్ర నేడు కూడా కొనసాగనుంది. ఈ సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున రత్నసింహాసనంపై చతుర్ధామూర్తులు కొలువు దీరారు. అనంతరం జగన్నాథుడిని అలంకరించారు. మంగళహారతి, మైలం, అబకాశ, తిలకధారణ, గోపాల వల్లభ సేవల తర్వాత 10 గంటలకు నేత్రోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ రథాలపై చెరాపహరా చేశారు. సాయంత్రం 4 గంటలకు సారథులు, అశ్వాలు అమర్చి తాళ్లు కట్టి 5 గంటలకు బలభద్రుని తాళధ్వజ రథం లాగారు. తర్వాత దేవీ సుభద్ర దర్పదళన్ అనంతరం పురుషోత్తముని నందిఘోష్ రథం తల్లి సన్నిధి వెళ్లింది. యాత్రను విజయవంతం చేయడానికి ఒడిశా సర్కార్ ఘన ఏర్పాట్లు చేసింది.

### తొలిసారి రాష్ట్రపతి రాక..

ఒడిశాలో ఏటా జరుపుకునే పూరీ రథయాత్రకు రాష్ట్రపతులెవరూ ఇప్పటి వరకు రాలేదు. తొలిసారిగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. గవర్నర్ రఘుబర్‌దాస్‌తో కలిసి రాష్ట్రపతి సుభద్రమ్మ రథం లాగారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంఝి, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు రథోత్సవానికి హాజరయ్యారు. కాగా రాష్ట్రపతి స్వరాష్ట్రం ఒడిశానే కావడం విశేషం. పూరీ వీధుల్లో కేంద్ర బలగాలు పహారా కాస్తున్నాయి. మూడంచెల భద్రత నడుమ బలగాలు గస్తీ కాస్తున్నాయి.

# రెండు రాష్ట్రాలు నాకు రెండు కళ్లు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చాలా బాగా పని చేస్తున్నారని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. రాష్ట్రాన్ని కూడా వేగంగా అభివృద్ధి చేస్తున్నారని అందుకే స్వయంగా వచ్చి కలిశానని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో టీటీడీపీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సభలో మాట్లాడిన చంద్రబాబు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై ప్రశంసలు కురిపించారు. తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ మొదటిస్థానంలో ఉందని చంద్రబాబు కొనియాడారు. పెద్ద రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్‌ను దాటుకొని తెలంగాణ అగ్రభాగాన ఉందని ప్రశంసలు కురిపించారు. అందుకు కారణం ఆ కాలంలో టీడీపీ చేపట్టిన అభివృద్ధేనని చంద్రబాబు చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటిని అభివృద్ధి చేసి దేశంలో నెంబర్ వన్‌గా చేశామని చంద్రబాబు వివరించారు. దూరదృష్టితో ఆలోచించి ఔటర్ రింగు రోడ్డు, ఎయిర్ పోర్ట్‌లను ప్రతిపాదన చేసి ప్రారంభించామని తెలిపారు. అయితే టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కొనసాగించాయని ఈ సందర్భంగా వాటిని అభినందిస్తున్నట్టు తెలిపారు.తెలుగు రాష్ట్రాల ప్రజలు అన్నదమ్ములుగా కొనసాగుతామని చంద్రబాబు తెలిపారు. తాను ఆంధ్రా తెలంగాణ అని కాకుండా తెలుగు ప్రజల కోసం పని చేస్తానని తెలిపారు. కొంత మంది గొడవలు పెట్టుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నారని గొడవలు పడితే నీళ్ల రావని పలు విషయాల్లో ఇబ్బందులు ఎదురుకోవాలని సూచించారు. అదే కలిసి సామరస్యంగా చర్చించుకుంటే సమస్యలు తీరుతాయన్నారు. మంచి పరిపాలన లేకపోతే రాష్ట్రం నష్టపోతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఏపీ చాలా నష్టాల్లో ఉందని ఎంత కష్టపడైనా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తానని తెలిపారు. విజన్-2020 అని తాను ఎప్పుడో చెప్పానని కానీ అప్పుడు అందరూ ఎగతాళి చేశారన్నారు. సెల్‌ఫోన్ కడుపు నింపుతుందా అని మాట్లాడారు ఇప్పుడు మళ్లీ చెబుతున్న విజన్-2047 అభివృద్ధి చెందిన భారత్ ఉంటుందన్నారు. తెలుగుజాతి గ్లోబల్ నెంబర్ వన్?గా ఉండాలన్నారు. మొన్నటి వరకు బ్రిటన్‌ను పాలించింది కూడా భారతీయుడే అని గుర్తుచేశారు. ప్రపంచంలో అందరికంటే ఆమోదమైన వ్యక్తులు భారతీయులన్నారని తెలిపారు. ప్రపంచానికి సేవ చేసే శక్తి మన భాతీయులకు ఉందన్నారు. తెలుగువారి అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తానని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రపదేశ్‌లో తాను తొమ్మిదిన్నరేళ్లు ముఖ్యమంత్రిగా చేశానని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. తన రికార్డును ఎవ్వరూ బ్రేక్ చేయలేరన్నారు. రాబోయే రోజుల్లో కమిటీలు వేసి నిర్ణయాలు తీసుకుందామని తెలిపారు. ఆదిలాబాద్ మొదలు శ్రీకాకుళం వరకు తాను తిరగని ప్రాంతం లేదన్నారు. తన చివరి రక్తపు బొట్టు వరకు ప్రజా సేవ చేస్తానని చంద్రబాబు చెప్పుకొచ్చారు. వచ్చే 30 ఏళ్లలో తెలుగు రాష్ట్రాలు ఎలా ఉంటాయో ఇప్పుడే ఒక విజన్ ఆలోచిస్తానని అన్నారు. మరోవైపు తెలంగాణలో త్వరలోనే టీడీపీకి కొత్త స్ట్రాక్చర్ తీసుకొస్తానని చంద్రబాబు తెలిపారు. యువకులకు అవకాశం ఇస్తానని తెలిపారు. తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తానని చెప్పుకొచ్చారు.

## రాహుల్ గాంధీ అహంకారంతో

# మాట్లాడటం తగదు

### - బీజేపీ ఎంపీ సుధాన్సు త్రివేది

అయోధ్యలో తాము బీజేపీని ఓడించిన తరహాలోనే గుజరాత్‌లోనూ కాషాయ పార్టీని మట్టికరిపిస్తామని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ ప్రతినిధి, ఎంపీ సుధాన్సు త్రివేది స్పందించారు. మతపరమైన ప్రాధాన్యత కలిగిన అంశాలపై మాట్లాడే సమయంలో సునిశితంగా, గౌరవంతో, హుందాగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతకు త్రివేది హితవు పలికారు. ఇలాంటి అంశాలు మాట్లాడే ముందు రాహుల్ అహంకారం వీడి నిజాయితీతో, నిరాడంబరతతో మాట్లాడాలని అన్నారు. విపక్ష నేతగా రాహుల్ పార్లమెంట్‌లో ఏ అంశాన్నైనా లేవనెత్తే స్వేచ్ఛ ఉంటుందని, కానీ ఆయన కేవలం విపక్షంలోనే లేరని, పలు రాష్ట్రాల్లో అధికారంలో కూడా ఉన్నారని త్రివేది గుర్తుచేశారు. ఆయా రాష్ట్రాల్లో మెరుగైన పాలన అందించాలని, తాము విపక్షంలో ఉన్నప్పుడు తాము అభివృద్ధి విషయంలో గుజరాత్ మోడల్‌ను దేశానికి చాటిచెప్పామని ఆయన పేర్కొన్నారు. అహంకారపూరిత మాటలు రాహుల్ మాట్లాడటం ఆయనకు తగదని వ్యాఖ్యానించారు.

## కుల్గామ్ ముష్కరుల ఏరివేత.. రెండు ఎన్‌కౌంటర్లలో

## ఆరుగురు ఉగ్రవాదులు హతం.. అమరులైన ఇద్దరు సైనికులు..!



దక్షిణ కశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో రెండు ప్రాంతాల్లో ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఆదివారం ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతమార్చాయి. ఇంతకు ముందు శనివారం నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. రెండు ఘటనల్లో రెండురోజుల్లో ఆరుగురు ఉగ్రవాదులను బలగాలు ఏరివేశాయి. అయితే, ఈ ఆపరేషన్స్‌లో ఇద్దరు సైనికులు వీరమరణం పొందారు. ఘటనపై జమ్మూ కశ్మీర్ డీజీపీ ఆర్ఆర్ స్వైన్ మాట్లాడుతూ కుల్గామ్‌లో సైన్యం, పోలీసులు సంయుక్త బృందం భారీ విజయాన్ని సాధించిందన్నారు. రెండు ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. ఒక ప్రాంతంలో ఎన్‌కౌంటర్ ముగిసిందని.. మరోచోట కాల్పులు కొనసాగుతున్నాయన్నారు. మరో వైపు జమ్మూ డివిజన్‌లోని రాజోరి జిల్లాలో అనుమానాస్పద కాల్పుల్లో ఓ సైనికుడు గాయపడ్డాడని తెలిపారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సైనికుడి కాలుకు బుల్లెట్ గాయాలయ్యాయని సమాచారం. రాజోరి జిల్లా మంజాకోట్‌లో ఉన్న సైనిక శిబిరంలో అనుమానాస్పద కాల్పుల్లో సైనికుడు గాయపడ్డాడు. ఆ తర్వాత సంఘటనా స్థలంలో దాదాపు అరగంటపాటు కాల్పులు కొనసాగాయి. అనంతరం గాయపడ్డ సైనికుడిని గుర్తించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. సైనికుడు ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడ్డాడా? లేదంటే ప్రమాదవశాత్తు కాల్పులు జరిపాడా? అన్నది స్పష్టంగా తెలియరాలేదు. అయితే, కుల్గామ్‌లో ఫ్రిసల్ చిన్నిగాంలో నలుగురు ఉగ్రవాదులు హతమైనట్లుగా ఐజీ బీకే బిర్ది తెలిపారు. ఆదివారం మరో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని చెప్పారు. ఎన్‌కౌంటర్ స్థలంలో నలుగురు ఉగ్రవాదుల మృతదేహాలతో పాటు మూడు ఏకే47, ఓ పిస్టల్ స్వాధీనం చేసుకున్నారు. సమాచారం ఈ ఉగ్రవాదులు హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన టీఆర్ఎఫ్ వర్గానికి చెందినవారుగా తెలుస్తున్నది. ఖైమోహ్‌లోని బషీర్ అహ్మద్ దార్ తనయుడు యావర్ బషీర్, యారిపొరా నివాసి గంహౌద్ దార్ కుమారుడు జాహిద్ అహ్మద్ దార్, అబ్ సతార్ రాథర్‌కు చెందిన తౌహిద్ అహ్మద్ రాథర్ కుమారుడు, కుల్గామ్ నివాసి మహ్మద్ షరీఫ్ వానీ కుమారుడు షకీల్ అహ్మద్ వానీగా గుర్తించారు. మిగిలిన ఇద్దరు ఉగ్రవాదులు ఎవరనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఫ్రిసల్ చిన్నిగాం, ముదర్గాం ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిన ఎన్‌కౌంటర్‌లో పారా కమాండో లాన్స్ నాయక్ ప్రదీప్ నైన్, ఫ్రిసల్‌లో జాతీయ రైఫిల్స్ సైనికుడు ప్రవీణ్ ప్రభాకర్ గాయపడ్డారు. అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందారు. అయితే వీరి పేర్లను సైన్యం అధికారికంగా ధ్రువీకరించలేదు. ఆదివారం వీరిద్దరికీ సైనిక లాంఛనాలతో అంతిమ వీడ్కోలు పలికారు.

## కల్తీ సారా ఘటనపై సీబీఐ దర్యాప్తు

### - పళనిస్వామి డిమాండ్

కళ్లకురిచి నాటు సారా ఘటనలో పెద్దసంఖ్యలో ప్రజలు మరణించిన ఉదంతం దేశవ్యాప్తంగా సంచలన సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి డిమాండ్ చేశారు. కళ్లకురిచి ఘటనపై రాష్ట్ర పోలీసులు విచారణ చేపట్టారని, అయితే రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపడితే నిజమైన దోషులకు శిక్ష పడదని అన్నారు. రాష్ట్ర పోలీసుల విచారణపై సీబీఐ దర్యాప్తు జరిగితే వాస్తవాలు వెలుగుచూస్తాయని చెప్పారు. ఈ ఘటనపై సీబీఐ విచారణ జరిపించి నిజమైన దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు కల్తీ సారా ఘటనపై తమిళనాడు బీజేపీ నేత తమిళి సై స్పందించారు. కల్తీ సారా ఘటనతో ప్రజలు మృత్యువాత పడిన కళ్లకురుచిని స్టాలిన్ ఎందుకు సందర్శించలేదని తమిళిసై ప్రశ్నించారు. మరోవైపు బీఎస్పీ రాష్ట్ర చీఫ్ కే ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యను ఆమె ఖండించారు. ద్రవిడ మోడల్ ప్రస్తుతం హత్యా రాజకీయాల మోడల్‌గా మారిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడులో హత్యా రాజకీయాలు పెరుగుతున్నాయని, ఇంత జరుగుతున్నా సీఎం స్టాలిన్ మౌన ముద్ర దాల్చారని ఆరోపించారు. ఈ హత్యపై సీబీఐ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.



# నాకు ఏదైనా సమస్య వస్తే ఆయన్నే పిలుస్తా

## - సీనియర్ నటి టబు

వెటరన్ నటుల లిస్ట్‌లో చేరిపోయినా టబును ఇప్పటికీ తెలుగువాళ్లు ఆరాధిస్తుంటారు. టాలీవుడ్‌లో టాప్‌హీరోల సరసన నటించిన ఈ భామ తాజాగా 'ఆరోం మే కహా దమ్ థా' సినిమాలో అజయ్ దేవ్‌గణ్‌తో స్క్రీన్ షేర్ చేసుకుంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో అజయ్ దేవ్‌గణ్ గురించి టబు చేసిన కామెంట్లు వైరల్ అవుతున్నాయి. 'అజయ్‌ని నేను చాలా గౌరవిస్తా.నాకు చిత్ర నిర్మాతలతో ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు నా తరపున మాట్లాడటానికి అతణ్ని పిలుస్తాను. ఆయన కూడా నాతో అన్ని విషయాలను షేర్ చేసుకుంటారు. అంతేకాదు నాతో కలిసి పనిచేయడానికి ఎప్పుడూ రెడీగా ఉంటారు.

మేము ఎంత క్లోజ్‌గా ఉన్నప్పటికీ నా నిర్ణయాలలో ఎప్పుడూ జోక్యం చేసుకోరు. ఒకరిని ప్రభావితం చేయడానికి అజయ్ ప్రయత్నించరు.ఆయన ప్రతి ఒక్కరినీ గౌరవిస్తారు. ఇక, అజయ్ నా సోదరుడికి చిన్ననాటి స్నేహితుడు. సినిమాల్లోకి రాకముందే అజయ్ నాకు తెలుసు.

ఆయన పెండ్లయ్యాక కూడా మా స్నేహంలో ఎలాంటి మార్పు రాలేదు. సినిమాలంటే అజయ్‌కు చాలా ఇష్టం. అయితే, ఆయన దర్శకుడు కావాలని అనుకున్నారు' అని చెప్పుకొచ్చింది సీనియర్ హీరోయిన్ టబు.

# ప్రభాస్ ఏది అడిగినా చేసిపెట్టాలన్నదే నా కోరిక

## మనసులో మాట బయటపెట్టిన పాయల్ రాజ్‌పుత్



వెండితెర మేఘమైతే.. దానిపై మెరిసిన మెరుపు తీగ పాయల్ రాజ్‌పుత్. 'ఆర్ఎక్స్ 100'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి కుర్రాళ్ల గుండెల్లో గుబులు రేపింది. మొదటి చిత్రంతో హాట్ బ్యూటీగా గుర్తింపు పొందిన ఆమె వరుస అవకాశాలతో దూసుకుపోయింది. కానీ, కొందరు పనిగట్టుకొని తనను తప్పుదోవ పట్టించడంతో మోసపోయానని చెబుతున్నది పాయల్. ఇటీవల 'మంగళవారం' హిట్‌తో మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చిన ఈ నటి తాజాగా 'రక్షణ' సినిమాతో మరోసారి ప్రేక్షకులకు అందాల విందు చేయనుంది. హిట్ హీరోయిన్‌గా పేరొచ్చినా.. కెరీర్‌లో ఎత్తుపల్లాలు ఎదుర్కొన్న ఈ హాట్ హీరోయిన్ పంచుకున్న కబుర్లు ఇవి..కథ డిమాండ్ చేస్తే బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. 'ఆర్ఎక్స్ 100' కథలో భాగంగానే శృంగార సన్నివేశాలు ఉన్నాయి. కానీ, కథలో లేకున్నా.. అనవసరంగా అలాంటి సన్నివేశాలు జొప్పిస్తే మాత్రం ఒప్పుకోను.కెరీర్ మొదట్లో పంజాబీ టెలీ సీరియల్స్, సినిమాల్లో నటించాను. మరాఠీలో ఘనవిజయం సాధించిన 'సైరత్' చిత్రం పంజాబీ రీమేక్ నాకు మంచి గుర్తింపునిచ్చింది. ఆ చిత్రంలో నా నటనకు ఫిలింఫేర్ అవార్డు లభించింది. ఇక టాలీవుడ్‌లో 'ఆర్ఎక్స్ 100' సాధించిన సక్సెస్ నాకు వరుస అవకాశాలు తెచ్చిపెట్టింది.ఇలియానా, అనుష్కశెట్టి అంటే ఇష్టం. పవన్‌కళ్యాణ్ చిత్రాలు ఎక్కువగా చూస్తాను. అవకాశం వస్తే మహేశ్‌బాబు, ప్రభాస్ సినిమాల్లో చేయాలని ఉంది. ప్రభాస్ నా ఫేవరెట్. ఆయనకు లంచ్ ఏర్పాటు చేయాలనుకుంటున్నా. తను ఏది అడిగితే అది చేసిపెట్టాలని నా కోరిక. రాజ్మా రైస్ నాకు నాకు చాలా ఇష్టం. దాన్ని నేనే స్పెషల్‌గా వండి నా చేత్తో ప్రభాస్‌కు తినిపించాలని ఉంది. అలాంటి చాన్స్ వస్తే మాత్రం అస్సలు వదులుకోను.నేను ఎలాంటి పాత్రలు పోషించాలన్నది ప్రధానం కాదు. స్క్రిప్టులో బలం ఉండాలి. కథ లేకుండా, ఎలాంటి పాత్ర చేసినా ఫలితం శూన్యమే. ముందుగా కథ, నా పాత్ర నచ్చాలి. డైరెక్టర్ మంచివాడై ఉండాలి. అలాంటి సినిమాలే ఒప్పుకొంటాను. బలమైన కథతో రూపొందే హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాల్లో నటించాలని ఉంది. కథ నచ్చితే రెమ్యునరేషన్ గురించి పెద్దగా పట్టించుకోను.నేను ఏ పనిచేసినా 200 శాతం ఎఫర్ట్స్ పెడతాను. అయితే ఒక్కోసారి మనం ఆశించిన ఫలితం రాకపోవచ్చు. అది డెస్టినీ అనుకుంటాను. 'ఆర్ఎక్స్ 100' సక్సెస్‌ను నేను సద్వినియోగం చేసుకోలేదనే చెప్పాలి. ఆ టైమ్‌లో చాలామంది నన్ను మిస్‌లీడ్ చేశారు. ఇప్పుడు తత్వం బోధపడింది. ఎక్కడికి వెళ్లాలి, ఎక్కడికి వెళ్లకూడదు, ఏం చేయాలి, ఏం చేయకూడదు లాంటి విషయాలు తెలిసొచ్చాయి. ఇప్పుడు ఏదైనా ప్రాజెక్టు ఓకే చేయడానికి ముందు ఇవన్నీ ఆలోచిస్తాను. నా జాగ్రత్తలో నేనుంటాను.

### నాని 'సరిపోదా శనివారం' నుంచి

# ప్రియాంక మోహన్ ఫస్ట్ లుక్ రిలీజ్



స్టార్ హీరో నాని నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం' నాని 31గా వస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నాడు. నాని సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్?గా నటిస్తుండగా.. ఎస్?జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నాడు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ చిత్రం ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మూవీ నుంచి విడుదల చేసిన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే నేడు మూవీ నుంచి ప్రియాంక అరుళ్ మోహన్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ఈ మూవీలో ప్రియాంక మోహన్ లేడి పోలీస్ చారులత పాత్రలో నటిస్తున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతుంది.యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రంలో సాయికుమార్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇక 'అంటే సుందరానికి' సినిమా తర్వాత నాని వివేక్ కాంబో రిపీట్ అవుతుండడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు

# వరుస ఆఫర్లు వస్తున్నాయ్: నేహా ధూపియా



ప్రముఖ నటి, మోడల్ నేహా ధూపియా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తల్లి అయిన తర్వాత కూడా ఫిట్‌నెస్ సూత్రాలు పాటిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచింది ఈ హాట్ బ్యూటీ. ప్రెగ్నెన్సీ, డెలివరీ అనంతర పరిణామాలతో 25 కిలోల వరకు బరువు పెరిగిన నేహా.. వర్కవుట్లు, డైట్‌తో దాదాపు 23 కిలోలు తగ్గింది. అయితే, బరువు తగ్గడంలో తన టార్గెట్‌ను ఇంకా చేరుకోలేదని అంటున్నది. 2000 సంవత్సరంలో జపనీస్ సినిమాతో తెరపైకి వచ్చి తెలుగు, హిందీ, పంజాబీ, ఉర్దూ సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది నేహా.ఆమె నటించిన కామెడీ సినిమా 'బ్యాడ్ న్యూస్' ప్రేక్షకులను అలరించడానికి రెడీగా ఉంది. ఈ సందర్భంగా మీడియాతో కొన్ని సంగతులు షేర్ చేసుకుంది. '2018లో అంగద్ బేడీని పెండ్లి చేసుకున్నాను. మెహర్ (మొదటి సంతానం)కు జన్మనిచ్చిన తర్వాత కరోనా లాక్‌డౌన్ స్టార్ట్ అయ్యింది. ఇంటి దగ్గరే ఉన్నాను. డైట్ పాటించి బరువు తగ్గాను. మరో మూడేండ్లకు మరోసారి ప్రెగ్నెంట్ అయ్యాను. దాంతో మళ్లీ బరువు పెరిగాను. డెలివరీ తర్వాత లావుగా అవుతానా లేదా అనే దాని గురించి ఆలోచించలేదు.పిల్లలకు ఏడాది వచ్చేవరకు వారికి పాలిచ్చాను. ఫిట్‌నెస్‌పై ఫోకస్ పెట్టలేదు. 25 కిలోల వరకు బరువు పెరగడంతో సినిమా ఆఫర్లు రాలేదు. ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి ఏకంగా 23 కిలోలు తగ్గాను. ఇందుకోసం నేను పెద్దగా కష్టపడింది లేదు. రన్నింగ్ చేసేదాన్ని. జిమ్‌కు వెళ్లాను. షుగర్, ఫ్రై లాంటి వాటిని డైట్‌లో లేకుండా చూసుకున్నాను. రాత్రి 7 గంటలకు డిన్నర్ పూర్తి చేసేదాన్ని. ఇప్పటికీ ఇవే ఫాలో అవుతున్నా. బరువు తగ్గి ఫిట్‌గా మారిన తర్వాత ఆఫర్లు వస్తున్నాయ్' అని చెప్పుకొచ్చింది నేహా.

# కంటోన్మెంట్‌లో వింతలెన్నో,
# చెత్త మాది, ఖర్చు మీది

- ఐదు మండలాల పరిధిలో విస్తీర్ణించి ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్
- ఆర్మీ ఆధీనంలో ఏడువేల ఎకరాలకు పైగా భూమి ఉంది
- "బి 2"క్లాసిఫ్కేషన్ లో 2700పై చిలుకు ఎకరాలు
- నియోజకవర్గంలో ఎనిమిది వార్డులు,మోండా డివిజన్
- కేంద్రం నిధులకన్న సొంత వనరులు పుష్కలం, బోర్డు
- జనాభా అధికారులు లెక్కల ప్రకారం 2,53,715 , అనధికారికంగా నాలుగు లక్షల పైచిలుకు
- బోర్డు పరిధిలో మౌళిక సదుపాయాల కల్పనలో నిత్యం ఫైటింగ్
- కంటోన్మెంట్ సరిహద్దుల్లో జిహెచ్ఎంసి ప్రజలు ప్రతి రోజూ
- రెండు టన్నుల చెత్తా, వ్యర్థాలు పారెస్తారు
- హెల్త్ డిపార్టుమెంట్ లో అందరూ ఉన్న ఫోకస్ శూన్యం.
- ప్రతి ఏటా హెల్త్ డిపార్టుమెంట్ కి కొట్లల్లో నిధులు, వృధాగా లక్షల రూపాయలు
- హెల్త్ డిపార్టుమెంట్ సూపరింటెండెంట్ లు ప్రధాన కార్యాలయానికి పరిమితం
- అందుకే ఈ పరిస్థితి దాపురించింది
- "అన్ని ఉండి అల్లుడు నోట్లో శని "అన్నట్లు ఉంది,చెత్త తొలగింపు సిబ్బంది





**కంటోన్మెంట్( ప్రశ్న న్యూస్ )** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిస్థితి చాలా ఇబ్బందుల్లో ఉంది ? ఓ పక్క నిధులు లేక బోర్డు పరిధిలో ఉన్న బస్తీలకు, కాలనీలకు మౌళిక వసతుల కల్పనలో నిత్యం ఇబ్బందుల్లో ఇంజనీరింగ్ విభాగం, హెల్త్ డిపార్టుమెంట్.బోర్డు ఖజానాకు ప్రజలు కొడుతున్న పన్నులు రూపంలో వసూలు అవుతున్న ఆదాయం గతంతో పోలిస్తే ఎక్కువగానే ఉన్న అభివృద్ధికి సరిపడా నిధులు లేక నిత్యం అధికారులకు, ప్రజలు రాజకీయ నాయకులతో కుస్తీ. రక్షణ శాఖ నుంచి నిధులు రాక:గత ముప్పై ఏళ్లుగా బకాయిలు పెండింగ్లో ఉన్న సర్వీస్ చార్జీలు విడుదల గాక, గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉన్న నాయకులు మైకులో అదరగొట్టే ఉపన్యాసాలు తప్ప చిల్లీ గవ్వ తేనీ మేధావులు.రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు, కేంద్ర మంత్రులకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును సందర్శిస్తారు.గల్లీ సమస్యలు వింటారు ఢిల్లీ కి పొయినాక పక్కకు పెడుతారు.గతంలో పదుల సంఖ్యలో జరిగిన యాధార్థ సంఘటనలు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో గతంలో అధికారులు, సిబ్బంది వెయ్యిలల్లో విధులు నిర్వహించేవారు.కానీ ప్రస్తుతం కంటోన్మెంట్ ఏరియాలో జనాభా నలభై శాతం పెరగడంతో సిబ్బంది తక్కువ కావడం, అధికారులు ఒకొక్కోరిగా రిటైర్మెంట్ అవ్వడంతో బోర్డు సిఈవో పై వత్తిడి బాగా పెరిగిందని చెప్పకనే చెబుతున్నాయి పరిస్థితిలు.ప్రస్తుతం బోర్డులో అధికారులు, సిబ్బంది మొత్తం కలిసి సుమారు మూడు వందల యాభై పై చిలుకు ఉన్నట్లు సమాచారం.పొరుగు సేవల ఉద్యోగులు సుమారు పదిహేను వందల మంది వరకు సేవలు అందిస్తున్నట్లు సమాచారం. బోర్డు సరిహద్దుల్లో లక్షల ఖర్చు వృధా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధి సుమారు ఐదు మండలాల మధ్య విస్తరించి ఉంది.మల్కాజగిరి, అల్వాల్, బాలా నగర్, సికింద్రాబాద్,మారెడ్ పల్లి,తిరుమలగిరి మండలాలు. వీటి సరిహద్దుల్లో యాథేచ్చేగా వ్యాపార సముదాయాలు నిర్వహిస్తుంటారు.కానీ వీరి వల్ల ఒక్క పైసా కూడా బోర్డుకు జమ కాదు కదా,వీళ్లవల్ల కంటోన్మెంట్ కే ఏటా లక్షల్లో నష్టం.సరిహద్దుల్లో బోర్డు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు సిబ్బంది కలిసి "గారిబెజ్ డస్ట్ బిన్ లు "ఏర్పాటు చేస్తే ఆ చెత్త డబ్బలో స్థానికులు వేసే చెత్త చెదారం కన్న జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న ప్రజలు మాత్రం నూటికి తొంభై శాతం ఉపయోగించుకుంటారు. ఉదాహరణకు నిన్న ఉదయం ఆదివారం బోయిన్ పల్లి మార్కెట్ పక్కనున్న రిటైల్ కూరగాయల మార్కెట్ నిర్వాహకులు వేసిన చెత్త సుమారు రెండు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు సంబంధించిన వాహనాల్లో తొలిగిస్తుస్తారు.ఈ చెత్త తరలింపు వల్ల "బోర్డు వాహనానికి డిజిల్" సిబ్బంది సమయము అన్ని వృధానే.. ఈ తంతు నిన్న ఇవాళ జరుగుతున్న విషయం కాదు, గత కొన్నేళ్లుగా చోటు చేసుకుంటున్న విషయం, అయిన కూడా పట్టి పట్టనట్టు వ్యవహరిస్తుంది హెల్త్ డిపార్ట్మెంట్.అసలు విషయం ఏమిటంటే ఫీల్డ్ లో శానిటేషన్ ఇన్స్పెక్టర్లు కానరారు.అంత దఫేదార్లుతో వ్యవహారం చక్కపెడుతున్నారు ఉత్తర భారత దేశానికి చెందిన అధికారులు.ఉన్నత అధికారులు, రాజకీయ నాయకులు, జాతి పెద్దల జయంతి, వర్ధంతిలకు మాత్రం సార్లు రోడ్ల పై దర్శనమిస్తారు. విలీనం పై అనుమానాలు ఎన్నో: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును విలీనం అంశం దివంగత నేత ఎమ్మెల్యే సాయన్న హయాంలో పురుడు పోసుకుంది.అప్పట్లోనే విలీనం కావాల్సిన అంశం, పెండింగ్లో నో ఉంచింది రక్షణ శాఖ.గత కొంతకాలంగా "వికాస్ మంచ్" నేతృత్వంలో స్థానికులు తమ వాణిని ఢిల్లీకి వినిపించేలా జంతర్ మంతర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.దాని ప్రభావమే కొన్ని నెలలుగా జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఫోకస్ చేశాయి.మొన్నటి రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులతో, తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శాంత కుమారి భేటీ అయిన విషయం విదితమే. కానీ ఆర్మీ అధికారులు మాత్రం విలీనానికి ఒకే అంటూ మరొకపక్క ఆర్మీకి చెందిన స్థలాలు ఇవ్వడానికి నో చెప్పేసింది.ఇక్కడే అసలు చిక్కు మొదలైంది.సివిలియన్ ఏరియా ఇవ్వడానికి సుముఖంగా ఉన్న అధికారులు నడిబొడ్డున ఉన్న స్థలాలు ఇవ్వడానికి కొరి పెట్టడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.మరో ట్వీస్టు ఏమిటంటే సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సివిల్ మెంబర్ గా ఉన్న జె.రామకృష్ణ ఈ రోజు విలేకరుల సమావేశంలో బోర్డు విలీనం పైఎదురైయ్యే అంశాలపై మాట్లాడుతాను.విలీనం చేయడం వల్ల లాభం, నష్టం పై క్లుప్తంగ వివరిస్తానంటున్నారు.

# చంద్రబాబుకు భారీ వరం ప్రకటించిన మోడీ...



**కాకినాడ ( ప్రశ్న న్యూస్ ):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటన చేసిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కేంద్ర పెద్దలకు వివరించి సహాయం కోరడంతోపాటు కొన్ని ప్రాజెక్టులను కూడా సాధించుకొచ్చారు. అందులో భాగంగా రాష్ట్రంలో తొమ్మిది నెలల నుంచి తాత్కాలికంగా నిలిచిపోయిన ఎనిమిది జాతీయ రహదారుల విస్తరణకు మోక్షం కలిగింది. పనులు ప్రారంభించాలంటూ కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరగా ఆయన అంగీకరించారు. త్వరలోనే పనులు ప్రారంభం కాబోతున్నాయి.

ప్రధానమంత్రి దృష్టికి కూడా.. దేశవ్యాప్తంగా రూ.రెండు లక్షల కోట్లతో భారత్ మాల పరియోజన పథకం కింద జాతీయ రహదారులను విస్తరిస్తున్నారు. బడ్జెట్ కు మించి పనులు మంజూరు కావడంతో గతేడాది నవంబరు నుంచి వీటిని తాత్కలికంగా నిలిపివేశారు. ఇలా ఆగిపోయినవాటిల్లో మన రాష్ట్రానికి చెందిన ఎనిమిది రహదారులున్నాయి. వీటి విస్తరణ పనుల విలువ రూ.8243 కోట్లు. మరోసారి చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోడీ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్నారు.

### కీలకంగా ఉన్న పేరేచర్ల-కొండమోడు

ఈ రహదారుల విస్తరణలో అత్యంత కీలకమైనది పేరేచర్ల–కొండమోడు మార్గం. ఉమ్మడి గుంటూరు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు గ్రామం నుంచి గుంటూరుకు సమీపంలోని పేరేచర్ల వరకు ఉన్న 50 కిలోమీటర్ల జాతీయ రహదారి విస్తరణ పనులకు రూ.1032 కోట్లతో టెండర్లు పిలిచారు.

కాంట్రాక్టర్ ఎంపికైన తర్వాత ఎల్ఓఏ ఇచ్చే దశలో ఆగిపోయింది.గుంటూరు నుంచి హైదరాబాద్ మధ్య రాకపోకలకు సాగించేందుకు ఇది కీలకమైన రహదారి. ప్రస్తుతం ఈ రహదారి అత్యంత అధ్వాన్న పరిస్థితిలో ఉంది. దీంతో గుంటూరు, బాపట్ల, చీరాల, తెనాలి ప్రజలు కొంత దూరమైనా విజయవాడ వెళ్లి అక్కడినుంచి హైదరాబాద్ వెళుతున్నారు. విశాఖపట్నం– కొత్తవలస– అరకు మార్గంలో పెందుర్తి నుంచి బౌధార వరకు 42 కిలోమీటర్లను నాలుగు లైన్లుగా విస్తరించాల్సి ఉంది. ఇది టెండర్లు పిలిచిన తర్వాత ఆగిపోయింది...

# అవినీతికి నిలయంగా
# గూడూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



- డాక్యుమెంట్ రైటర్లదే హవా
- వారు చెప్పిందే రేటు - నేరుగా సబ్‌రిజిస్ట్రార్లతో లావాదేవీలు



**తిరుపతి బ్యూరో (ప్రశ్న న్యూస్)** పేరుకే గూడూరు సబ్రిజిస్ట్రార్ కార్యాలయాలు.. కానీ అక్కడంతా డాక్యుమెంట్ రైటర్లదే హవా.. రిజిస్టేషన్ కార్యాలయాల సమీపంలో అనధికారికంగా ఆఫీసులను ఏర్పాటు చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. కొనుగోలు, అమ్మకందారుల డాక్యుమెంట్లను రెడీ చేయాల్సిన రైటర్లు సబ్రిజిస్ట్రార్సిబ్బందికి అదనపు ఆదాయ వనరుగా మారారు. అక్రమాలు బయట పడకుండా, సిబ్బంది తప్పులు ఎవరికీ కనపడకుండా చూడడంలో వారిదే ప్రధాన పాత్ర. వారిని కాదంటే రిజిస్ట్రేషన్‌ఆఫీస్ లో ఫైళ్లు ముందుకు కదలదు. అధికారులు కొర్రీలు పెడుతూ పార్టీలను తిప్పించుకుంటారు.కొందరు రిజిస్ట్రార్లే ప్రైవేటు వ్యక్తులకు నెలనెలా కొంత మొత్తం చెల్లించి ఏజెంట్లుగా నియమించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్లు లేనిదే పని కావడం లేదు. వారి ఆధ్వర్యంలో మా మూళ్ల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి అవినీతి మరక అంటకుండా వారి జేబుల్లోకి డబ్బులు దర్జాగా చేరుతున్నాయి. వారధులుగా డాక్యుమెంట్ రైటర్లు అనధికార విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి డాక్యుమెంట్ రైటర్లను అనుమతించకూడదు. కానీ, అక్కడ ప్రతి పనీ వారి ద్వారానే జరుగుతోంది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతి ఆలవాలంగా మారాయి. పైసలిస్తేనే పని జరుగుతోంది. అక్కడ డాక్యుమెంట్ రైటర్ల రాజ్యం నడుస్తోంది. సబ్ రిజిస్ట్రార్లతో సంబంధాలు ఏర్పరుచుకొని వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. ఆస్తులు కొనడం కష్టంతో కూడినదైతే, దానిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడం గగనంగా మారుతోంది. అసలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్దకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. ప్రభుత్వం పారదర్శకత అని బాకాలు ఊదుతున్నా స్టాంపులు, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పరిస్థితిలో మాత్రం ఏమాత్రం మార్పు కన్పించడం లేదు. అవి అవినీతికి కేంద్రాలుగా మారాయి. ప్రతి చోటా ఫీజు టూ ఫీజు అంటూ డాక్యుమెంట్‌ను బట్టి వసూలు చేస్తున్నారు. దీంతోపాటు చట్టంలో ఉన్న చిన్నచిన్న లొసుగులను ఆసరా చేసుకొని అధిక మొత్తంలో డిమాండ్ చేస్తూ వాటాలు పంచుకుంటున్నారు.అది ఒక ప్రభుత్వ కార్యాలయం అయిన.. అక్కడ అంతా పైసా వసూల్ రాజ్యం నడుస్తుంది. పైసలుంటే చాలు నిబంధనలు పక్కన పెట్టేస్తారు. అంతా అడ్డదిడ్డంగా పనిచేసేస్తారు. డబ్బులు ఇస్తే ఎంతటి తప్పుడు పనినైనా ఇట్టే చేసేస్తారు.

### -డాక్యుమెంట్ రైటర్లదే హవా

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయలన్నింటిలోనూ డాక్యుమెంట్ రైటర్ల హవా నడుస్తోంది. వారు వసూల్ రాజాలుగా మారారు. సబ్ రిజిస్ట్రార్‌లకు, భూ క్రయ, విక్రయదారులకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లు ఓకే చెప్పకపోతే సబ్ రిజిస్ట్రార్లు ఏదో ఒక కొర్రీ వేసి రిజిస్ట్రేషన్ నిలిపివేస్తున్నారు. అప్పుడు తిరిగి బేరసారాలు సాగించాల్సి వస్తోంది. వాస్తవంగా డాక్యుమెంట్ రైటర్ దస్తావేజులు రాసినందుకు ఒక్కో దానికి రూ.వెయ్యి నుంచి రూ.2వేలు తీసుకుంటారు. అయితే రిజిస్ట్రేషన్ ఖర్చులు, సబ్ రిజిస్ట్రార్‌లకు ఫీజు టూ ఫీజు చెల్లించాలంటూ భారీ మొత్తాలను వసూలు చేస్తున్నారు. డాక్యుమెంట్‌లలో ఉన్న చిన్నచిన్న లోపాలను భూతద్దంలో చూపించి మరింత పిండుకుంటున్నారు. వీటిలోనూ సబ్ రిజిస్ట్రార్లకు వాటాలు పుచ్చుకుంటన్నారు. కొందరు మార్కెట్ విలువ తగ్గిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్ విలువ కంటే ఎక్కువ ధరను సబ్ రిజిస్ట్రార్లతో చెప్పించి ఆతరువాత తగ్గించినట్లు కొనుగోలుదారులను నమ్మించి పెద్దమొత్తం రాబట్టుకుంటున్నారు. ఇలా డాక్యుమెంట్ రైటర్లు రైట్ అంటేనే దస్తావేజుల రిజిస్ట్రేషన్ జరుగుతోంది.

### -ఫీజ్ టూ ఫీజ్

గూడూరు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఫీజు టూ ఫీజు సర్వసాధారణమైంది. ఎప్పుడో బ్రిటీష్ కాలం నాటి పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోంది. ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రభుత్వానికి చెల్లించే ఫీజుతోపాటు అంతే మొత్తాన్ని అదనంగా సబ్‌రిజిస్ట్రార్‌కు, కార్యాలయ సిబ్బందికి చెల్లించాల్సి ఉంటుంది. అంటే దస్తావేజు రిజిస్ట్రేషన్‌కు ఫీజు రూ.50 వేలు ఉంటే అంతే మొత్తం ఫీజ్ టూ ఫీజ్ కింద కప్పం కట్టాలి. అయితే మధ్యలో డాక్యుమెంటు రైటర్లు కొంత ఫీజు తగ్గించి వసూలు చేసి సబ్ రిజిస్ట్రార్‌లకు చేరవేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని అలాగే అవినీతి అధికారుల భరతం పట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588